ప్రజాశక్తి
మంగళవారం 16 సెప్టెంబర్ 2025 8 పేజీలు





ప్రకాశం బాపట్ల



ప్రకాశం జిల్లా కలెక్టర్ రాజాబాబు



బాపట్ల జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్

సిఎం కాన్ఫరెన్స్‌కు హాజరైన
ప్రకాశం, బాపట్ల కలెక్టర్లు

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన కలెక్టర్లతో కాన్ఫరెన్స్‌ను సోమవారం ప్రారం భించారు. ఈ కార్యక్రమానికి ప్రకాశం జిల్లా కలెక్టర్ పి.రాజా బాబు హాజరయ్యారు. కలెక్టర్ల సదస్సును ప్రత్యక్ష ప్రసారం ద్వారా సంయుక్త కలెక్టర్ ఆర్. గోపాలకష్ణ, ఇతర అధికారులు ప్రకాశం భవనం వీడియో కాన్ఫరెన్స్ హాలులో వీక్షించారు. రెండు రోజులపాటు జరిగే ఈ కాన్ఫరెన్స్‌లో శాఖల వారీగా వివిధ అంశాలపై కలెక్టర్లకు ముఖ్యమంత్రి దిశా నిర్దేశం చేయనున్నారు. ఇందుకు సంబంధించి ప్రత్యేక టైం టేబుల్ ను కూడా రాష్ట్ర అధికారులు రూపొందించారు. ఆయా వివరాలను జిల్లా స్థాయి అధికారులకు తెలియజేసి, ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించాలని ఆదేశించారు. ఈ నేపథ్యంలో సంయుక్త కలెక్టర్, వివిధ శాఖల ఉన్నతాధికారులు ప్రత్యక్ష ప్రసారాన్ని వీక్షించారు.

బాపట్ల జిల్లా : రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన కలెక్టర్లతో కాన్ఫరెన్స్‌ను సోమవారం ప్రారంభించారు. రెండు రోజుల పాటు నిర్వహిస్తున్న ఈ సమావేశంలో బాపట్ల జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ పాల్గొన్నారు.

జిల్లా డెయిరీని ఎన్‌డిడిబికి అప్పగిస్తేనే భవిష్యత్

- పునరుద్ధరణపై ఏడాదిగా జిల్లా నేతల తర్జనభర్జనలు
- తెలుగుదేశం పాలకవర్గం హయాంలోనే సంస్థ దివాళా
- పరిశ్రమల కోసం తిప్పలు పడేకన్నా దీన్ని తెలిస్తే ఎంతో మేలు
- అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో జిల్లా ఎమ్మెల్యేలు కదిలిస్తేనే



ప్రజాశక్తి-ఒంగోలుబ్యూరో

జిల్లా డెయిరీని పునరుద్ధరిస్తామని ప్రతిపక్షంలో ఉన్నపుడు చంద్రబాబు, యువనేత లోకేష్ చెప్పారు. జిల్లా పర్యటనల్లో ప్రముఖంగా హామీలు ఇచ్చారు. దాని ప్రాముఖ్యతను అప్పట్లో ఘనంగానే చెప్పారు. అధికారం వచ్చి 14 నెలలు గడిచింది. ఇప్పటికీ దీని పునరుద్ధరణ అంశం చర్చలో ఉన్నా చర్యలు మాత్రం లేవు. దాన్ని ఎలా పునరుద్ధరించాలనే దానిపైనే నేతల్లో తర్జనభర్జన నడుస్తోంది. మంత్రి డోలా వీరాంజనేయస్వామి దీనిపై ఇప్పటికే సిఎంచంద్రబాబు దృష్టికి తీసుకెళ్లారు. ఆయన కూడా ఏం చేయాలనేదానిపై స్పష్టతకు రాలేకపోయారు. ఇప్పటికే మూతపడిన పాలపొడి ఫ్యాక్టరీతోపాటు డెయిరీ కూడా నడవాలి. దీనికి ప్రత్యామ్నాయం గతంలో మాదిరిగా ఎన్‌డిడిబికి అప్పగించడమే ఉత్తమ మార్గమని డెయిరీలో పనిచేసిన ఉద్యోగులు, పాల ఉత్పత్తిదారులు అంటున్నారు. ఇది తప్ప ఇతర పద్ధతులు, విధానాలతో ప్రయోజనం లేదంటున్నారు. ప్రైవేటు వారికి అప్పగిస్తే దాని ఆస్తులు కాజేయడం తప్ప రైతుల ప్రయోజనాల కోసం పనిచేయడం ప్రశ్నార్థకమే నంటున్నారు. ప్రభుత్వం దీనిపై ఏ నిర్ణయం తీసుకుంటుందో చూడాలి. ఇపుడు ఏమి చేయాలన్నా భారీగా నిధులు కావాలి. బదిలీపై వెళ్లిన కలెక్టర్ అన్సారియా కూడా గతంలో కలెక్టర్ల సమావేశంలోనూ ప్రస్తావించారు. 40 వేల మంది పాలఉత్పత్తిదారుల ప్రయోజనాల కోసం, పాడి పరిశ్రమ ఉద్ధరణ కోసం డెయిరీని పునరుద్ధరించాలని ప్రతిపాదించారు. అందుకోసం రూ.75కోట్లు నిధులు అవసరమని నివేదిక ఇచ్చారు. దీనిపై మంత్రులు జోక్యం చేసుకుని నిధులు రాబడితే దాన్ని ఏదో రకంగా తిరిగి దారిలో పెట్టే అవకాశం ఉండేది. అయితే దాన్ని ఎవరూ పూర్తిస్థాయిలో పట్టించుకో లేదనే చెప్పాలి. ఇపుడు పరిశ్రమల కోసం భూములు ఇస్తామన్నావెవరూ ముందుకు ▶ 2లో



అసంపూర్తిగా నిలిచిన పాత శింగరాయకొండ హైస్కూల్ భవనాలు

నాడు లేదూ.. నేడు లేదూ..

- మధ్యలో నిలిచిపోయిన పాఠశాలల భవన నిర్మాణాలు
- ఇబ్బంది పడుతున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు
- పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి-శింగరాయకొండ

గత ప్రభుత్వం 'నాడు-నేడు' పేరుతో ప్రభుత్వ పాఠశాలను అభివద్ధికి శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా మొదటి విడతగా కొన్ని పాఠశాలకు ఎంపిక చేసి అభివద్ధి పనులు చేపట్టారు. అనంతరం రెండో విడతగా కొన్ని పాఠశాలలను ఎంపిక చేసి పనులు ప్రారంభించారు. అయితే పనులు పూర్తి చేయకుండానే మధ్యలోనే నిలుపుదల చేశారు. ఫలితంగా ఆయా పాఠశాలల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడతున్నారు. చేసిన పనులకు బిల్లులు మంజూరు కాక పోవడంతో కాంట్రాక్టర్లు పనులు మధ్యలోనే నిలుపుదల చేసినట్లు సమాచారం. పనులు పూర్తి స్థాయి చేపట్టక పోవడంతో అవి నిరుపయోగం మారాయి. తరగతి గదుల లేక విద్యార్థులు, ఉపాధ్యాయులు అవస్థలు పడుతున్నారు. కొన్ని పాఠశాలల భవనాలను స్లాబ్ వేసి వదిలేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అధికారులు ఆ పాఠశాలలో వైపుమ కన్నెత్తి చూస్తారని ఉపాధ్యాయులు ఎదురు చూశారు. అయినప్పటికీ అధికారులు ఆదిశగా పట్టించుకోలేదు. శింగరాయకొండ మండలం పాత శింగరాయకొండ ఎంపిపి స్కూల్ జిల్లా పరిషత్ హైస్కూల్ అప్‌గ్రేడ్ అయ్యింది. భవన నిర్మాణం కోసం నాడు-నేడు పథకం ద్వారా అడ్మిషన్ శాంక్షన్ పేరుతో రూ. 1.54 కోట్లు మంజూరు చేశారు. అయితే రూ.86 లక్షలు మాత్రమే విడుదల చేశారు. రూ.68 లక్షలు విడుదల చేయాల్సి ఉంది. నిధుల రాకపోవడంతో కాంట్రాక్టర్ మధ్యలోనే పనులు నిలుపుదల చేశాడు. దీంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు అవస్థలు పడుతున్నారు. ఊళ్ళ పాలెం జిల్లా పరిషత్ హైస్కూల్ పరిస్థితి కూడా ఇలాగే ఉంది. ఈ పాఠశాలకు అడ్మిషన్ శాంక్షన్ కింద రూ. 70 లక్షలు కేటాయించారు. రూ.41 లక్షలు మాత్రమే విడుదల చేశారు. మరో రూ.28 లక్షలు విడుదల చేయించాల్సి ఉంది. వచ్చిన డబ్బులతో రెండు ఫ్లోర్లు మాత్రమే ▶ 2లో

జిల్లా డెయిరీని ఎన్‌డిడిబికి అప్పగిస్తేనే భవిష్యత్

(మొదటిపేజీ తరువాయి)

రావడంలేదు. కనిగిరి, దొనకొండ వద్ద భూములు ఇస్తామని చెప్పినా..ఎపిఐఐసి ప్లాట్లు వేసి అన్ని సౌకర్యాలు కల్పించినా కూడా ఒక్క పరిశ్రమ కూడా రాలేదు. ఈ తరుణంలో డెయిరీని పునరుద్ధరిస్తే ప్రత్యక్షంగా రైతులకు, పాల ఉత్పత్తుల విక్రయాలతో ఎంతో మందికి ఉపాధి కలుగుతుంది. పట్టణాల్లో ప్రజలకూ నాణ్యమైన పాలు అందుతాయి. ఇపుడు నకిలీపాలు, నీళ్ల పాలు తాగాల్సిన పరిస్థితి వచ్చింది. యూరియా, పామాయిల్‌తో కల్తీ పాలు తయారు చేసి అమ్మేవాళ్లకు చెక్‌పెట్టి నట్లవుతుంది. ఇవన్నీ ప్రైవేటు డెయిరీ రాకతోనే మొల య్యాయి. వ్యాపారంగా మారడంతోనే అక్రమాలు తెరపైకి వచ్చాయి. ఇక డెయిరీ విషయానికి వస్తే ఎక్కువ కాలం తెలుగుదేశం పార్టీ చేతిలోనే పాలవర్గం ఉంది. లాభాలు వచ్చినా..నష్టాలు వచ్చి దివాళా తీసినా తెలుగుదేశం నేతలే కారణంగా భావించక తప్పదు. దివాళా తీశాకే 2021 జనవరిలో డెయిరీని మూసేశారు. అమూల్‌కు అప్పగించినా ఆ సంస్థ కూడా నడపలేదు. ఉద్యోగులను విఆర్‌ఎస్ ఇచ్చి ఇంటికి పంపారు. 64 మంది రెగ్యులర్ ఉద్యోగులు, 150మందికిపైగా కాంటాక్టుపద్ధతుల్లో పనిచేసే ఉద్యోగులు ఇళ్లకు పోయారు. ఎంతో మందిపాల ఉత్పత్తులపై ఆధారపడి బతికేవాళ్లంతా ప్రత్యామ్నాయాలు చూసుకున్నారు. ప్రైవేటు డెయిరీల్లో పనిచేస్తున్నారు. జిల్లా డెయిరీ ఒకప్పుడు జిల్లాకే తనమానికంగా ఉంది. 1990 దశకంలో జిల్లా డెయిరీ ఎంతో ఉన్నతంగా నడిచింది. జిల్లాలో పాల ఉత్పత్తికి అన్ని విధాలా దోహదపడింది. జిల్లా డెయిరీ ద్వారా గ్రామాల్లో ఆర్థికాభివృద్ధి కనిపించింది. ఒకరోజు పాల డబ్బులు రైతులకు ఆపి ఆ డబ్బులతోనే జిల్లాడెయిరీకి భూములు కొన్నారు.రైతులు కూడా భూములు ఇచ్చారు. అలా మొదలైన డెయిరీ ప్రస్థానం ఒంగోలులో ఎన్‌డిడిబి సహకారంతో పాలపొడి ఫ్యాక్టరీతో మరో మైలు రాయిగా నిలిచింది.అప్పట్లో సిఎంగా ఉన్న ఎన్‌టిఆర్ దీనికి ప్రాధాన్యత ఇచ్చారు. తర్వాత దాన్ని నాశనం చేశారు.సహకార రంగంలో మాక్స్ చట్టం వచ్చాక ప్రైవేటు డెయిరీలు రాకతో జిల్లా డెయిరీ ప్రాభవం కోల్పోయింది. రోజుకు 1.50 లక్షల లీటర్లు వచ్చే పాలు రానురాను రోజుకు 30 వేల లీటర్లకు పడిపోయాయి. ఒంగోలులో డెయిరీ ఆఫీసులు, పాలపొడి ఫ్యాక్టరీతోపాటు కనిగిరి, కొండ మంజులూరు, కంభం, వై.పాలెంలో పాలశీతలీకరణ కేంద్రాలూ ఉన్నాయి. సుమారు రూ.1200 కోట్లు విలువైన ఆస్తులు ఇపుడు డెయిరీకి ఉన్నాయి. ఒంగోలులోనే 100 ఎకరాల భూమి ఉంది. దీని విలువ ఇపుడు ఎకరం రూ.10 కోట్లకుపైనే ఉంది. ఇక దీని దివాళా తెలుగుదేశం పాలకవర్గం చేతిలోనే నడిచింది. చల్లా శ్రీనివాసరావు ఎక్కువ కాలం చైర్మన్‌గా కొనసాగారు. పాలపొడి ఫ్యాక్టరీకి ఎన్‌డిడిబి ఇచ్చిన రుణం రూ.22 కోట్లకుగానూ చాలా కాలం ఆ సంస్థే డెయిరీని నడిపింది. అప్పులు తాలూకు డబ్బులు జమ చేసుకుంది. 2012లో జీరో బ్యాలెన్సుతో అంటే నష్టాలు లేకుండా తిరిగి జిల్లా డెయిరీని మనకు అప్పగించారు. నిర్వహణ లోపాలతో డెయిరీ నష్టాల్లోకి వెళ్లింది. రూ.100 కోట్ల వరకూ నష్టాలు వచ్చాయి.2021లో మూతపెట్టారు. అమూల్ కూడా చేతులెత్తేసింది. ఉద్యోగులకు వేతనాలు ఇవ్వలేని స్థితిలో రాష్ట్ర ప్రభుత్వం నుంచి గ్రాంటుల కోసం ఎదురు చూశారు. ఆందోళనలతో ఉద్యోగులకు ఎంతో కొంతిచ్చారు. ఇంకా రూ.10 కోట్లు ఇవ్వాలని చెబుతున్నారు. ఇపుడు రాష్ట్ర ప్రభుత్వం దీన్ని ఎన్‌డిడిబికి అప్పగించడం తప్ప మరో ప్రత్యామ్నాయం లేదంటున్నారు. ప్రభుత్వం నడిపినా ఇబ్బంది లేదనే చర్చ ఉంది. చంద్రబాబు ఆలోచనల ప్రకారం పిపిపి పద్ధతుల్లోకి వెళితే బడాకంపెనీలు వచ్చి డెయిరీ ఆస్తులను కాజేయడం తప్ప మరో ఆలోచనే ఉండదంటున్నారు.అసెంబ్లీ సమావేశాల సందర్భంగా డెయిరీ అంశాన్ని మంత్రులు సీరియస్‌గా తీసుకోవాలి. సిఎం చంద్రబాబు దృష్టికి తీసుకుపోవాల్సిన అవసరం ఉంది.

సాధు వెంకటేశ్వర్లుకు సత్కారం

ప్రజాశక్తి-మార్కాపురం

మార్కాపురంలోని వాసవీ విజన్ క్లబ్ నిర్వాహకులు ఇంజనీర్స్ డే సందర్భంగా భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్యను స్మరించుకుంటూ ఏటా సీనియర్ ఇంజనీర్లను సత్కరిస్తుంటారు. సోమవారం నాటి ఇంజనీర్స్ డే సందర్భంగా మార్కాపురం పంచాయరాజ్ శాఖలో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న సాధు వెంకటేశ్వర్లును సత్కరించారు. సాధు వెంకటేశ్వర్లు ఎన్నో ఉత్తమ అవార్డులు గతంలో అందుకున్నారు. సత్కార కార్యక్రమంలో క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షులు వెలుగూరి వెంకటేశ్వర్లు, క్లబ్ వ్యవస్థాపక కార్యదర్శి, ఇంటర్నేషనల్ ప్రోగ్రాం కో ఆర్డినేటర్ పోలేపల్లి వెంకటలక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పశువులకు టీకాలతో ఉపయోగం

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెం మండలంలోని మొగుళ్లపల్లి గ్రామంలో పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో సోమవారం 540 పశువులకు గాలికుంటు టీకాలు వేశారు. ఈ సందర్భంగా మురారిపల్లి ప్రభుత్వ పశు వైద్యాధికారి డాక్టర్ ఉడుముల శివారెడ్డి మాట్లాడుతూ పాడి పశువులకు గాలికుంటు టీకాలు వేయడం వలన పాడి పశువుల్లో వ్యాధిని అరికట్టి పాల ఉత్పత్తి తగ్గకుండా చూసుకోవచ్చన్నారు. అలాగే మగ పశువుల్లో పని సామర్థ్యాలు తగ్గకుండా చూసుకోవచ్చని చెప్పారు. ఈ టీకాల కార్యక్రమం మండలంలో నెల రోజుల పాటు జరుగుతుందని చెప్పారు. పశువులు ఉన్న రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పశు ఆరోగ్య సహాయకులు జిలాని, ఫజురుల్లా, మౌనిక, అంజి నాయక్, మంత్ర నాయక్ తదితరులు పాల్గొన్నారు.



పశువులకు గాలికుంటు టీకాలు వేస్తున్న దృశ్యం

సంతనూతలపాడు: మండలంలోని మద్దులూరు, బి మాచవరం, ఎండ్లూరు, రుద్రవరం గ్రామాల్లో సోమవారం నాడు ప్రారంభమైన పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాల ప్రత్యేక కార్యక్రమంలో 525 పశువులకు టీకాలు వేసినట్లు సంతనూతలపాడు, పేర్నమిట్ట పశు వైద్యాధికారులు కె అనూరాధ, పి చిరంజీవి తెలిపారు. ఆయా గ్రామాలలో పశు వైద్య సిబ్బంది పశుపోషకుల గృహాలు, షెడ్ల వద్ద పర్యటించి పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేసినట్టు వారు తెలిపారు. వైరస్ వల్ల పశువులకు ఈ వ్యాధి సోకుతుందని, తద్వారా మేత తక్కువగా తినడం, పాల దిగుబడి తగ్గడం, జ్వరము తదితర లక్షణాలు అధికంగా ఉంటాయని పశు వైద్యాధికారులు పేర్కొన్నారు. ప్రభుత్వం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన గాలి కుంటు వ్యాధి నివారణ టీకాలను పశు పోషకులు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. నిర్దేశించబడిన షెడ్యూల్ ప్రకారం ఆయా గ్రామాల్లో పశువులకు స్థానిక సచివాలయాల పశు వైద్య సిబ్బంది ఈ గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయనున్నట్టు వారు తెలిపారు.

17, 18 తేదీల్లో మాగుంట పర్యటన

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డి ఈ నెల 17, 18 తేదీలలో పలు కార్యక్రమాలలో పాల్గొననున్నారు. 17న ఉదయం 8 గంటలకు తన కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉంటారు. 10 గంటలకు ఒంగోలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల (జిజిహెచ్)లో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ నిర్వహించే స్వస్త్ నారీ - సశక్త్ పరివార్‌లో పాల్గొంటారు. 10.30 గంటలకు ఒంగోలులోని కర్నూలు రోడ్డులో శ్రీ హర్షిణి డిగ్రీ కాలేజీ కరస్పాండెంట్ గోరంట్ల రవికుమార్ శ్రీ హనుమాన్ ఫిల్లింగ్ స్టేషన్‌లో నిర్వహించే పూజా కార్యక్రమంలో పాల్గొంటారు. 11 గంటలకు ఒంగోలు కొత్త కూరగాయల మార్కెట్ దగ్గర షాదీ ఖానాలో నిర్వహిస్తున్న ఎపి టూవీలర్ మెకానిక్ వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జనరల్ బాడీ సమావేశంలో పాల్గొంటారు. మధ్యాహ్నం ఒంటి గంటకు తన కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉంటారు. సాయంత్రం 6 గంటలకు ఒంగోలులో జరిగే స్థానిక కార్యక్రమాలకు హాజరవుతారు. 18న ఉదయం 8 గంటలకు తన కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉంటారు. 11 గంటలకు ఒంగోలులో స్థానికంగా జరిగే కార్యక్రమాలకు హాజరవుతారు. మధ్యాహ్నం 1 గంటకు ఒంగోలు రాంనగర్ 2వ లైన్‌లోని తన కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉంటారు.

ప్రజా సైన్స్ ఉద్యమ కార్యకర్త నుంచి

రాష్ట్ర కార్యదర్శిగా ఎదిగిన స్వరూపారెడ్డి

ప్రజాశక్తి-గిద్దలూరు రూరల్



స్వరూపారెడ్డి

గిద్దలూరుకు చెందిన ప్రజా సైన్స్ ఉద్యమ నేత పి స్వరూపారెడ్డి ప్రజా సైన్స్ కార్యకర్త నుంచి నేడు జెవివి రాష్ట్ర కార్యదర్శి స్థాయికి ఎదిగారు. కర్నూలు జిల్లా కృష్ణగిరి మండలం తాపల కొత్తూరు గ్రామవాసి పంచ లింగాల స్వరూపరెడ్డి స్వగ్రామంలో ప్రాథమిక విద్య, కటారుకొండలో ప్రాథమికోన్నత విద్యను, నంద్యాల జిల్లా గోవిందపల్లెలో సెకండరీ విద్య, డోన్ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో, ఇంటర్మీడియట్ (సిఇసి), ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో డిగ్రీ గ్రాడ్యుయేషన్(బీకాం), అనంతపురం శ్రీకృష్ణదేవరాయ యూనివర్సిటీలో మాస్టర్ డిగ్రీ(ఎంకామ్), తమిళనాడు అన్నామలై యూనివర్సిటీ, తమిళనాడులో బీఈడీ విద్య నభ్యసించారు. ప్రకాశం జిల్లా, గిద్దలూరులో స్థిర నివాసం ఏర్పాటు చేసుకున్నారు. ప్రైవేటు పాఠశాల ఉపాధ్యాయుడుగా, ప్రధానోపాధ్యాయులుగా, నిర్వాహకుడిగా విద్యా బోధన చేశారు. ప్రవేట్ జూనియర్, డిగ్రీ కళాశాలలో కామర్స్ లెక్చరర్‌గా, ప్రిన్సిపాల్‌గా, డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వహిస్తూ ప్రజా అభ్యుదయ వాదిగా, ఆదర్శ ప్రాయుడుగా అందరి ఆదరణ పొందారు. మూఢ నమ్మకాలపై పోరాటాలు, సైన్స్‌పై సమీక్షలు, సెమినార్లు నిర్వహిస్తూ సమ సమాజ నిర్మాణంలో భాగస్వాములయ్యారు. ప్రజా సైన్స్ ఉద్యమ సంస్థ, జాతీయ అవార్డు గ్రహీత, జన విజ్ఞాన వేదిక గిద్దలూరు డివిజన్ అధ్యక్షులుగా, ప్రకాశం జిల్లా జెవివి అధ్యక్షులుగా, రాష్ట్ర సభ్యులుగా అనేక బాధ్యతలు నిర్వహించారు. గత 37 సంవత్సరాలుగా విద్య, వైద్య, ఆరోగ్య, సామాజిక, సాంస్కతిక కార్యక్రమాల్లో కీలక పాత్ర పోషించారు. సామాన్య ప్రజలు ఎదుర్కొంటున్న మూఢనమ్మకాలు, శాస్త్రీయ భావాలు, అందవిశ్వాసాలు, చాందస భావాలపై ప్రజల్లో చైతన్యాన్ని కల్పించే జన విజ్ఞాన వేదికకు స్వరూపరెడ్డి రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికయ్యారు. ఆయన ఎన్నిక పట్ల సైన్స్ ఉద్యమ ప్రియులు, ప్రజా సంక్షేమ సంఘాల, అభ్యుదయ, మేధావి వర్గ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

నాడు లేదూ.. నేడు లేదూ..

(మొదటిపేజీ తరువాయి)

నిర్మించారు. అనంతరం పనులు నిలుపుదల చేశారు. దీంతో ఆ భవనం నిరుపయోగంగా మారింది. ప్రభుత్వ హైస్కూలు పరిస్థితి ఇలాగే ఉంది. రూ. 70 లక్షలు విడుదల చేయాల్సి ఉంది. రూ.54 లక్షలు మాత్రమే మంజూరు చేశారు. రూ.16 లక్షలు విడుదల కావాల్సి ఉంది. ఆ నిధులు మంజూరైతే పెయింట్లు వేసుకొని కిటికీలు, లైట్లు ఏర్పాటు చేసుకొని తరగతులు నిర్వహించుకోవచ్చు. మండలంలో మొత్తం 28 పాఠశాలల పరిస్థితి ఇలాగే ఉంది. నాడు-నేడు ద్వారా కేటాయించిన నిధులు పూర్తి స్థాయిలో విడుదల కాకపోవడంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచి పోయాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ పాఠశాలలను అభివృద్ధి చేస్తారని అందరూ ఎదురు చూస్తున్నారు. అయితే నాడు- నేడులో అవినీతి జరిగిందని, ఈ విషయంపై విచారణ జరుగుతుందని, విచారణ పూర్తయితేనే నిధులు మంజూరు చేస్తారని చెబుతున్నారు. మండలంలో నాడు-నేడు ద్వారా పాత శింగరాయకొండ హైస్కూలు, ఊళ్లపాలెం హైస్కూలు, మూలగుంటపాడు గవర్నమెంట్ హైస్కూలు, శానంపూడి, పాకల, శింగరాయకొండ గ్రామ పంచాయతీలో 28 పాఠశాలలకు రూ. 7,88,59,000 అడ్మిషన్ శాంక్షన్ అయ్యింది. అయితే రూ.5,63,24,000 మంజూరు చేశారు. మరో రూ.2,25,35,000 విడుదల చేయాల్సిఉంది.ఈ నగదు మంజూరు చేస్తే అన్ని పాఠశాలను పూర్తిస్థాయిలో అభివద్ధి చేయివచ్చు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి నిధులు మంజూరు చేసి పాఠశాలలో మిగిలిపోయిన పనులను పూర్తి చేయించి భవనాలను వినియోగంలోకి తీసుకు రావాలని ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్తులు కోరుతున్నారు.

ఉపాధ్యాయ పోస్టులకు ఎంపిక

ప్రజాశక్తి-పొదిలి



వెంకట రాజశేఖరరెడ్డి

డీఎస్సీలో ఉపాధ్యాయ పోస్టులకు పొదిలి అభ్యర్థులు ఎంపికయ్యారు. ఇటీవల నిర్వహిం చిన ఉపాధ్యాయ ఎంపిక పరీక్ష డీఎస్సీలో పొదిలికి చెందిన అభ్యర్థులు ఉపాధ్యాయ పోస్టు లకు ఎంపికయ్యారు. పొదిలికి చెందిన మల్లెల వెంకట రాజశేఖర్‌రెడ్డి ఈరోజు ప్రకటించిన మెరిట్ జాబితాలో స్కూల్ అసిస్టెంట్ విభాగంలో ఫిజికల్ ఎడ్యుకేషన్‌లో ఎంపికయ్యారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అధ్యాపకుడిగా పనిచేస్తున్న రమణారెడ్డి కుమారుడైన రాజశేఖర్‌రెడ్డి పొదిలిలో శ్రీ వివేకానంద బిపిడి ఫిజికల్ ఎడ్యుకేషన్ కోర్సులు అభ్యసించి డీఎస్సీలో ఉద్యోగానికి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా కళాశాల యాజమాన్యం వెంకటేశ్వరరావు, రమణారెడ్డి, సహచర విద్యార్థులు, తల్లిదండ్రులు, బంధుమిత్రులు రాజశేఖర్‌ను అభినందించారు.

బయాలజీ విభాగంలో ఒంగూరి సాత్విక...



ఒంగూరి సాత్విక

సోమవారం ప్రభుత్వం ప్రకటించిన డీఎస్సీ మెరిట్ జాబితాలో పొదిలికి చెందిన ఒంగూరి సాత్విక సమంత స్కూల్ అసిస్టెంట్ విభాగంలో జీవశాస్త్రంలో ఉద్యోగం సాధించింది. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు అభినందించారు.

మల్లికకు ఉపాధ్యాయ పోస్టు



మల్లిక

సోమవారం ప్రభుత్వం ప్రకటించిన డీఎస్సీ మెరిట్ జాబితాలో పొదిలికి చెందిన టంగుటూరి మల్లిక అలియాస్ దర్శి మల్లిక స్కూల్ అసిస్టెంట్ విభాగంలో తెలుగులో 9వ ర్యాంకు సాధించి ఉద్యోగం సంపాదించింది. ఈ సందర్భంగా ఆమెను కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు అభినందించారు.

ముమ్మరంగా కారుమంచి కాలువ పనులు

ప్రజాశక్తి-చీమకుర్తి

ప్రవాస భారతీయుడు కె.వి పాలెం నివాసి నల్లూరి వెంకట శేషయ్య సహకారంతో గత పది రోజులుగా కారుమంచి కాలువ పునరుద్ధరణకు జంగిల్ క్లియరెన్స్, స్కిల్, ఆక్రమణల తొలగింపు కార్యక్రమాలు ముమ్మరంగా సాగుతున్నాయి. ఒంగోలు బ్రాంచ్ కాలువ నుంచి కారుమంచి కాలువ ద్వారా చీమకుర్తి, సంతనూతలపాడు మండలాల పరిధిలో దాదాపు 40 గ్రామాలకు తాగు, సాగునీరు అందుతున్న సంగతి తెలిసింది. గత నాలుగేళ్ల క్రితం కారుమంచి కాలువ కట్టకు ఆనుకొని అక్రమంగా మధుకాన్ గ్రానైట్ కంపెనీ వారు త్రవ్వకాలు సాగించటంతో కాలువ గట్టు గనిలోకి జారిపోయింది. మండల పరిషత్ వాళ్లు తాత్కాలిక మరమ్మతులు చేసి స్వల్పంగా నీటిని విడుదల చేసే విధంగా ఏర్పాటు చేశారు. అయితే గత ఏడాది నల్లూరి వెంకట శేషయ్య తన సొంత నిధులతో కారుమంచి కాలువకు మరియు గోనుగుంట మేజర్‌లకు నూతన నూతన షట్టర్లను బిగించి దాదాపు 25 కిలోమీటర్ల మేర కాలువ జంగిల్ క్లియరెన్స్, స్కిల్ టు తొలగింపు కార్యక్రమాలు యుద్ధ ప్రాతిపదికన చేపట్టారు. కాలువ ద్వారా భారీగా నీటి విడుదల చేసే విధంగా కాలువను పునరుద్ధరించారు. దీనివల్ల గత ఏడాది రైతులకు పుష్కలంగా నీరు అందడంతో పాటు మంచినీరు సౌకర్యం కూడా కలిగింది. ఈ ఏడాది కూడా ఓబీసీ షట్టర్ నుంచి కారుమంచి కాలువ దాదాపు రెండు కిలోమీటర్ల మేర కాలువలో జంగిల్ క్లియరెన్సు చేస్తున్నారు. కారుమంచి కాలువ గట్టు ఆక్రమణ గురై, ఒక వాహనమే పోయే విధంగా ఉంది. ఈ నేపథ్యంలో ప్రత్యేకంగా ప్రోక్లైన్‌ను ఏర్పాటు చేసి గత పది రోజులుగా కట్టపై ఆక్రమణలు తొలగించి రోడ్డును వెడల్పు చేశారు. దీంతో రెండు వాహనాలు రాకపోకలు నిరాటంకంగా వెళ్లే అవకాశం ఏర్పడింది. కారుమంచి కాలువ పునరుద్ధరకు నల్లూరి వెంకట శేషయ్య చేస్తున్న కృషిని రైతులు మరియు ప్రజలు అభినందనలు తెలుపుతున్నారు. అయితే తెగిన కారు మంచి కాలువ గట్టును పునర్ నిర్మించడానికి ప్రభుత్వము డిఎంఎఫ్ నిధులు రూ.2.63 కోట్ల నిధులు కేటాయించారు. పనులు ప్రారంభించేలోగా నిధులు రెండు కోట్లకు మించి ఉండటంతో సాంకేతికపరమైన అనుమతులు కోసం గుంటూరు జల వనరుల శాఖకు పంపారు. పంపి కూడా రెండు నెలలు కావస్తున్న ఇప్పటికీ అనుమతులు రాకపోవడంతో కాలువ గట్టు పునరుద్ధరణ పనులు ఆగిపోయాయి. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తెగిపోయిన కారు మంచి కాలువ గట్టు పునర్ నిర్మాణానికి అనుమతులు మంజూరు చేయాలని రైతులు కోరుతున్నారు.



జంగిల్ క్లియరెన్స్ అనంతరం కారుమంచి కాలువ

ఒంగోలు రైల్వే స్టేషన్‌లో విస్తృత తనిఖీలు

పూరీ ఎక్స్‌ప్రెస్‌లో 15 కేజీల గంజాయి, రూ.75 వేలు నగదు స్వాధీనం

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

మాదకద్రవ్యాల నిర్మూలనే లక్ష్యంగా ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఆదేశాలతో మహిళా పోలీస్ స్టేషన్ సీఐ సుధాకర్ ఆధ్వర్యంలో పోలీసులు, స్పెషల్ పార్టీ, ఈగిల్ టీం, డాగ్ స్క్వాడ్ రాక్సీతో కలిసి పలు ఎక్స్‌ప్రెస్ రైళ్ల బోగీలు, రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాలు, పార్సెల్ కేంద్రాలు తదితర ప్రదేశాల్లో తనిఖీలు నిర్వహించారు. అనుమానాస్పదంగా కనిపించిన పార్సిళ్లు, ప్రయాణికుల వద్ద ఉన్న బ్యాగులు మరియు ఇతర వస్తువులను ఒక్కొక్కటిగా తనిఖీ చేశారు.

పూరి ఎక్స్‌ప్రెస్‌లో సుమారు 15 కిలోల గంజాయి రూ.75 వేల నగదును స్వాధీనం చేసుకొని కేరళకు చెందిన ముజీబ్ రెహమాన్, ఒడిస్సాకు చెందిన రేణులను అదుపులోకి తీసుకున్నారు. మరో ఏడుగురు అనుమానితుల వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. తదుపరి దర్యాప్తు నిమిత్తం జిఆర్‌పి పోలీసులకు అప్పగించారు.

తొలి డ్యూటీలోనే గంజాయి పట్టుకున్న 'రాక్సీ'

పది నెలలపాటు ప్రత్యేక శిక్షణానంతరం ఈనెల 5న ప్రకాశం జిల్లాకు కేటాయించిన బెల్జియం మాలినోయిస్ జాతికి చెందిన రాక్సీ జాగిలం సోమవారం తనిఖీలలో కీలక పాత్ర పోషించింది. నార్కోటిక్స్ (మత్తు పదార్థాలు గుర్తింపు) మరియు క్రైమ్ ట్రాకర్ (నేరస్థులను పట్టుకోవడం) అనే రెండు అంశాలలో రాక్సీ జాగిలం ప్రత్యేక శిక్షణ పొందింది. గంజాయి మరియు మాదకద్రవ్యాల సమాచారం ఉంటే వెంటనే టోల్ ఫ్రీ నంబర్ 1972, డయల్ 112, లేదా పోలీస్ వాట్సాప్ నంబర్ 9121102266కు ఇవ్వాలన్నారు. ఈ తనిఖీలో ఎస్సైలు శ్రీకాంత్, ఆంజనేయులు, చెంచయ్య, శివరామయ్య, ఆర్పీఎఫ్, జీఆర్‌పీ ఎస్సై మధుసూదన్ రావు, ఈగిల్ టీం సిబ్బంది పాల్గొన్నారు.



తనిఖీల్లో పట్టుబడిన గంజాయి



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న అధికారులు

గాలికుంటు వ్యాధికి టీకాలు

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

గాలి కుంటు వ్యాధి నివారణకు టీకాలు వేసే కార్యక్రమాన్ని ఈనెల 15 నుంచి వచ్చేనెలా 15 వరూ నిర్వహిస్తున్నట్లు ఇన్‌ఛార్జి సంయుక్త కలెక్టర్ గంగాధర్ గౌడ్ తెలిపారు. పశు వైద్యశాఖ రూపొందించిన వాల్ పోస్టర్‌ను సోమవారం విడుదల చేశారు. అంటువ్యాధుల నుంచి పశు సంపదను కాపాడటం కోసం నూరు శాతం ఉచితంగానే టీకాలు వేస్తామన్నారు. ఈ అవకాశాన్ని పశు పోషకులంతా సద్వినియోగం చేసుకోవాలన్నారు. పశు వైద్యాధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ అదికారి డాక్టర్ వేణుగోపాల్, ఆర్‌డిఓ పి.గ్లోరియా, ఉప కలెక్టర్ లవన్న, మున్సిపల్ కమిషనర్ రఘునాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



శంకుస్థాపన నిర్వహిస్తున్న దృశ్యం

అంబేద్కర్ విగ్రహం ఏర్పాటుకు శంకుస్థాపన

ప్రజాశక్తి-చీమకుర్తి : మండలంలోని కె.వి పాలెం సామాజిక భవనం ప్రాంగణంలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం ఏర్పాటుకు భూమి పూజ కార్యక్రమం జరిగింది. సోమవారం అంబేద్కర్ యూత్ ఫోర్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జడ్పిటిసి వేమా శ్రీనివాసరావు పాల్గొని మాట్లాడుతూ ప్రపంచ మేధావి, భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సూచించిన మార్గం అందరికీ అనుసరణీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో కె.వి పాలెం అంబేద్కర్ యువజన సంఘం నాయకులు వేమా చిన కోటేశ్వరరావు, మాజీ సర్పంచ్ రాయపాటి కోటయ్య, పారాబత్తిన పేరయ్య, వేమా ఎలమందయ్య, వేమ బాల కోటేశ్వరరావు, పారబత్తిన ప్రభాకర్, పొత్తూరిసురేష్, బత్తుల కొండలరావు, పెద్ద సంఖ్యలో మహిళలు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే బిఎన్ విజయ్ కుమార్

సహాయనిధి చెక్కులు అందజేత

ప్రజాశక్తి-మద్దిపాడు

పార్టీలకతీతంగా సీఎం రిలీఫ్ ఫండ్‌లను అందజేస్తున్నట్లు ఎమ్మెల్యే బిఎన్ విజయ్ కుమార్ అన్నారు. మండలంలోని 21 గ్రామాలలో 85 మందికి 59 లక్షల 55వేల ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను లబ్ధిదారుల ఇంటికి నేరుగా వెళ్లి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత వైసిపి హయాంలో ఏ ఒక్కరికి ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు అందించిన దాఖలాలు లేవన్నారు. మండలంలో అనేక గ్రామాలలో సిమెంట్ రోడ్లు, డ్రైనేజీ కాలువలు చేపట్టినట్లు తెలిపారు. మల్లవరంలో వెంకటేశ్వర స్వామి ఆలయ చైర్మన్ మార్నేని రాఘవ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేకు డప్పులతో స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు ఉప్పుగుండూరి నాగేశ్వరరావు, మండల ప్రధాన కార్యదర్శి మందపల్లి శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు పోతినేని శ్రీనివాసరావు, మండవ జయంత్ బాబు, అడకా స్వాములు, జనసేన మండల అధ్యక్షులు నున్నా బాలసుబ్రమణ్యం, మాజీ సొసైటీ అధ్యక్షులు గట్టినేని అయ్యన్న, ఎంపీటీసీ మన్నం కృష్ణ, మాజీ ఎంపీటీసీ పెనుమాక సుధాకర్, దుగ్గినేని నరసింహారావు, కావూరి విజయ్ రాజు పాల్గొన్నారు.

వృద్ధురాలి మెడలో చైన్ అపహరణ

ప్రజాశక్తి-శింగరాయకొండ : శింగరాయకొండ మండలం మూలగుంటపాడు గ్రామపంచాయతీ కార్యాలయం సమీపంలో సోమవారం ఓ వృద్ధురాలి మెడలో చైన్ దొంగిలించిన సంఘటన చోటుచేసుకుంది. రాయి యానాదమ్మ పంచాయతీ కార్యాలయం దగ్గరలో నూతన గృహం నిర్మించుకుంటోంది. విద్యానగర్‌లో ఉన్న అపార్ట్మెంట్ నుంచి అక్కడికి నడుచుకుంటూ వెళుతుండగా గుర్తుతెలియని ఇద్దరు యువకులు మోటార్ బైక్ మీద వచ్చి మెడలో ఉన్న మూడు సవర్ల బంగారపు గొలుసును లాక్కొని పరారయ్యారు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సీఐ సిహెచ్.హజరత్తయ్య, ఎస్ఐ బి.మహేంద్ర ఘటనా స్థలానికి చేరుకొని దొంగతనం జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. చుట్టుపక్కల వారిని విచారించి ఆ ప్రాంతంలో సీసీ కెమెరాలును పరిశీలించారు.

విద్యుత్ విజిలెన్స్ అధికారుల తనిఖీ

ప్రజాశక్తి-దర్శి : అక్రమంగా విద్యుత్ వాడకంపై విద్యుత్‌శాఖ విజిలెన్స్ అధికారులు సోమవారం దర్శి టౌన్, మండల పరిధిలోని 40 బృందాలుగా తనిఖీలు చేపటారు. రూ.2.75 లక్షలు అపరాధ రుసం విధించినట్లు ఒంగోలు పర్యవేక్షక ఇంజనీర్ కె.వెంకటేశ్వర్లు తెలిపారు. విద్యుత్ చౌర్యంపై 9440812358, 9440812359 నెంబర్ల ద్వారా ఫిర్యాదు చేయవచ్చున్నారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పి.శ్రీనివాసులు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ టి.హైమావతి, డిఇఇ డి.రవికుమార్, డిఇఇ డి.హరిబాబు, ఏఇ కె.కోటయ్య, ఏఇ కోటేశ్వరరావు, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

మిద్దె ఎక్కుతూ జారిపడి మహిళ మృతి



సమాచారం సేకరిస్తున్న పోలీసులు

ప్రజాశక్తి-సిఎస్.పురం : మండలంలోని వి.బైలు గ్రామంలో మిద్దెపైకి ఎక్కుతూ ప్రమాదవశాత్తు కాలు జారి మహిళ మృతి చెందిన సంఘటన సోమవారం జరిగింది. గ్రామానికి చెందిన బసివి లక్ష్మమ్మ(68) మిద్దె పైన గింజలు ఆరబెట్టేందుకు వెళుతూ ప్రమాదవశాత్తు మెట్ల పైనుండికాలు జారి కిందపడి గాయాలయ్యాయి. తలకు గాయాలు కావడంతో వైద్యశాలకు తీసుకెళ్తుండగా మార్గమధ్యంలో మృతి చెందింది. సంఘటన స్థలాన్ని పోలీసులు సందర్శించి మృతికి గల కారణాలను తెలుసుకున్నారు. మృతురాలికి భర్త, ఒక కుమార్తె ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి-టంగుటూరు

రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్ మృతి చెందిన సంఘటన టంగుటూరు పరిధిలోని జాతీయ రహదారిపై జరిగింది. అందిన వివరాల మేరకు.. ఒంగోలు వైపు నుంచి నెల్లూరు వెళుతున్న లారీని వెనుక నుంచి వస్తున్న మరో లారీ ఢీకొట్టింది. లారీ సగం డివైడర్ మీదకు పోయి సగం మొదటి లైన్‌లో ఉండగా ఆ వెనకేనే వస్తున్న సిమెంట్ లోడు లారీ రెండో లారీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సిమెంట్ లోడ్ లారీ డ్రైవర్ చింతల భాస్కర్‌కి గాయాలు కాగా ఒంగోలు రిమ్స్ హాస్పటల్‌లో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి తండ్రి చిన్న చింతలయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు టంగుటూరు ఎస్ఐ వి.నాగమల్లీశ్వరరావు తెలిపారు.

వెల్లంపల్లి బ్రిడ్జి కింద మృతదేహం

ప్రజాశక్తి-మద్దిపాడు

మండల పరిధిలోని వెల్లంపల్లి వద్ద బ్రిడ్జి కింద మృతదేహం సోమవారం లభ్యమైంది. మృతుడిది గుంటూరు నగరంలోని హౌసింగ్ బోర్డు కాలనీ సమీపంలో ఉన్న సీతానగర్-2 లైన్‌కు చెందిన వేముల రామాంజనేయులు(40)గా పోలీసులు గుర్తించారు. వివాహేతర సంబంధం నేపథ్యంలో ఈ హత్య జరిగినట్లు మృతదేహాన్ని ఈనెల 7వ తేదీన కారులో తీసుకొచ్చి ఇక్కడ పడేసినట్లు పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గుంటూరుకు తరలించారు.

మనస్తాపంతో యువకుడు ఆత్మహత్య

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్



త్రినాధ్ మృతదేహం

ఒంగోలులోని పాత మార్కెట్ సెంటర్‌లోని ధరణి లాడ్జిలో సోమవారం కట్టా త్రినాధ్ (30) అనే యువకుడు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. లాడ్జి నిర్వాహకులు గమనించి ఒకటో పట్టణ పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు మృతుని బంధువులకు సమాచారం ఇచ్చి, కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఒంగోలు జిజిహెచ్‌కు తరలించారు.

నాగులుప్పలపాడు మండలం చవటపాలెం గ్రామానికి చెందిన త్రినాధ్ గతంలో నెల్లూరు బస్టాండ్‌లో రమ్య మెడికల్స్ పేరుతో మందుల షాపు నిర్వహించి తీసివేసి ప్రస్తుతం స్వగ్రామంలోనే నివాసం ఉంటున్నాడు. అతనికి నాగులుప్పలపాడు మండలం ఒమ్మెవరం గ్రామానికి చెందిన యువతితో వివాహం అయ్యింది. తదుపరి ఉద్యోగం చేసేందుకు ఆమె అమెరికా వెళ్ళింది. అమెరికా వెళ్ళడానికి అప్పులు చేసి నగదు సర్దుబాటు చేసినట్లు సమాచారం. అయితే అమెరికా వెళ్ళిన తరువాత భార్య అతనిని సరిగా పట్టించుకోవటం లేదని సమాచారం. దీంతో మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడినట్లు బంధువులు, స్నేహితులు భావిస్తున్నారు.

బైక్‌ను ఢీకొన్న కారు.. ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి-చీరాల

మితిమీరిన వేగంతో ప్రయాణిస్తున్న కారు ఓ బైక్‌ను ఢీకొట్టడంతో ఇద్దరికి గాయాలైన సంఘటన చిన్నగంజాం టోల్‌గేట్ సమీపంలో సోమవారం జరిగింది. అందిన వివరాల మేరకు.. చెన్నైకు చెందిన ఎస్‌కె జబిర్, ఎస్ కె ఇస్మాయేల్ బాపట్లలోని ఓ శుభకార్యానికి హాజరై తిరిగి వెళ్తుండగా ఒంగోలు వైపుకు వస్తున్న కారు అతి వేగంతో వస్తూ ఢీకొట్టింది. బైక్‌పై ఇద్దరూ రోడ్డుపై పడిపోగా ద్విచక్ర వాహనం చెట్లలోకి దూసుకెళ్లింది. కారు డ్రైవర్ కారు ఆపకుండా పరారయ్యాడు. క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో చీరాల ఏరియా ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి పరారైన కారు డ్రైవర్ కోసం గాలిస్తున్నారు.

పొగాకును ప్రభుత్వమే కొనుగోలు చేయాలి

ప్రజాశక్తి - బాపట్ల

రైతుల వద్ద ఉన్న పొగాకు మొత్తం ప్రభుత్వమే కొనుగోలు చేయాలని ఇంకొల్లు మండలం నుండి వచ్చిన రైతులు, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి పి కొండయ్య ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్లో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అధికారులకు అర్జీ అందజేశారు. ఈ సందర్భంగా కొండయ్య మాట్లాడుతూ రైతులు ఆరు గాలం కష్టపడి 3, 4 ఎకరాలు కౌలుకు తీసుకొని సాగు చేస్తున్న పొగాకును కేవలం 20క్వింటాలు మాత్రమే కొనుగోలు చేశారని, మిగతా పొగాకు అంతా ఒక్కొక్కరి వద్ద 50క్వింటాళ్ళ వరకు నిల్వ ఉండిపోయిందని అన్నారు. దీంతో రైతులు తీవ్ర ఆవేదన చెందుతున్నారని అన్నారు. అధికారులు అవగాహన రాహిత్యంతో ఒక్కొక్క రైతు పేరే నమోదు చేయించుకోవడంతో ఇబ్బందులు వచ్చాయని అన్నారు. 30, 40 ఎకరాలు సాగుచేసిన రైతులు తమ పిల్లల పేర్లు, బంధువుల పేర్లు నమోదు చేసుకొని పంట అంతా అమ్ముకున్నారని, ఎకరం రూ30వేలు, రూ35వేల చొప్పున కౌలుకు తీసుకొని పొగాకు అమ్ముడు పోక కౌలు రైతుల పరిస్థితి అగమ్య గోచరంగా తయారైందని అన్నారు. రైతుల వద్ద ఉన్న పొగాకు మొత్తం ప్రభుత్వం చొరవ తీసుకొని కొనుగోలు చేయించాలని కోరారు. ఆర్డీఓ పి గ్లోరియా మార్క్ ఫెడ్ అధికారులతో సంప్రదించి గోదాములు అన్ని నిండిపోయాయని, పొగాకు నిల్వ చేయడానికి స్థలం లేదని, ప్రభుత్వం తమకు కేటాయించిన కోటా పూర్తయిందని తెలిపారు. దీంతో పొగాకు కొనుగోలు ఆపామని పొగాకు నిల్వలపై రైతుల ఇబ్బందులను ప్రభుత్వానికి నివేదిక పంపామని తెలిపారు. ప్రభుత్వం అనుమతిస్తే కొనుగోలు చేస్తామే తప్ప తమ చేతిలో ఏమీ లేదని మార్క్ఫెడ్ ఎండి కరుణశ్రీ స్పష్టం చేసినట్లు తెలిపారు. రైతుల పరిస్థితి ఏమిటని కొండయ్య ప్రశ్నించారు. రైతుల వద్ద ఉన్న పొగాకు పూర్తిగా కొనేవరకు ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామని హెచ్చరించారు. అర్జీ అందజేసిన వారిలో ఇంకొల్లు ప్రాంత కౌలు రైతు నాయకులు కసుకుర్తి గంగయ్య, చెక్కా ప్రసాదు, బంగారయ్య, మేడికొండ చంద్రం, నక్కల దానియేలు, నూతలపాటి కోటేశ్వరరావు, కట్టా హరిప్రసాద్ పాల్గొన్నారు.


డిఆర్ఒకు వినతి పత్రం అందజేస్తున్న రైతు నాయకులు

రెవెన్యూ సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - మార్టూరు రూరల్

రెవెన్యూ అధికారులు తప్పుల తడకగా నిర్వహించిన మొదటి విడత రీ సర్వేలో లోపాలు సరిచేయడానికి తిరిగి సర్వే నిర్వహించి సంవత్సరం పూర్తయిన రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు అలానే ఉన్నాయని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కందిమళ్ల రామకోటేశ్వరరావు పేర్కొన్నారు. అపరిష్కృతంగా ఉన్న రైతు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రైతు సంఘం కార్యదర్శి వీరవల్లి కృష్ణమూర్తి ఆధ్వర్యంలో స్థానిక తహశీల్దారు కార్యాలయం ఎదుట రైతులు ధర్నా సోమవారం చేశారు. ఈ సందర్భంగా రామకోటేశ్వరరావు మాట్లాడుతూ రీ సర్వేలో బయటపడిన తప్పులను సరిచేస్తామని గత జనవరి నెలలో తహశీల్దారు ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రామ సభల్లో రైతుల నుండి అర్జీలు స్వీకరించారని, అధికారులు వాటి పరిష్కారం విషయంలో మీనమేషాలు లెక్కపెడుతున్నారని ధ్వజమెత్తారు. రెవెన్యూ రికార్డుల్లో తమ వివరాలు సరి చేయకపోవడంతో సాగు చేసుకుంటున్న రైతులకు బ్యాంకుల నుండి రుణాలు మంజూరు కాక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. రెవిన్యూ రికార్డుల్లో విస్తీర్ణాలలో జరిగిన తప్పులు, జాయింట్ ఎల్పీలు, ఈనాం భూములు, ఎస్టేట్ భూములు, చుక్కల భూముల సమస్యలు పరిష్కరించడంలో జరుగుతున్న జాప్యాన్ని నివారించి అవసరమైన చోట సిబ్బందిని అదనంగా నియమించుకొని రెవిన్యూ సమస్యలు పరిష్కారించే దిశగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కారం కానీ పక్షంలో కలెక్టర్కు ఫిర్యాదు చేస్తామని అన్నారు. అనంతరం తహశీల్దారు ప్రశాంతికి సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని రైతు సంఘం నాయకులు అందజేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు బత్తుల హనుమంతరావు, ఎనికపాటి రాంబాబు, బొడెంపూడి సూరిబాబు, పాలెపు సాంబయ్య, గోనుగుంట్ల మోహనరావు, ఇందుర్తి నాగేశ్వరరావు, బొబ్బేపల్లి సాంబయ్య, తాటి నరసయ్య, గాడిపర్తి శివనాగేశ్వరరావు, సాధినేని అంకమ్మ చౌదరి, ధూళిపాళ్ల శ్రీను, తిరువీధుల బిక్షాలు, సదాశివరావు పాల్గొన్నారు.


అర్జీ అందజేస్తున్న రైతు నాయకులు రామకోటేశ్వరరావు

నల్లబ్యాడ్జీలతో విద్యుత్ ఉద్యోగుల నిరసన

ప్రజాశక్తి - పర్చూరు

స్థానిక విద్యుత్ కార్యాలయంలో విద్యుత్ ఉద్యోగులు తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ నల్ల బ్యాడ్జీలతో సోమవారం నిరసన వ్యక్తం చేశారు. రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు విద్యుత్ కార్యాలయం ఆవరణలో సిబ్బంది ప్లకార్డులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఉద్యోగ నాయకులు మాట్లాడుతూ విద్యుత్ ఉద్యోగులకు 1999 నుండి 2004 మధ్యకాలంలో ఉన్న జిపిఎఫ్ వర్తింప చేయాలని డిమాండ్ చేశారు. విద్యుత్ శాఖలోని జెఎల్ఎం గ్రేడ్ 2 ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని అన్నారు. క్షేత్రస్థాయిలో ఖాళీగా ఉన్న విద్యుత్ పోస్టులను భర్తీ చేయాలని కోరారు. కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. విద్యుత్ ఉద్యోగులకు, పెన్షనర్ల కుటుంబాలకు వైద్య ఖర్చులు చెల్లించాలని డిమాండ్ చేశారు. పెండింగ్లో ఉన్న డిఏ బకాయిలు వెంటనే విడుదల చేయాలని కోరారు. విద్యుత్ ఉద్యోగుల డిమాండ్లను పరిష్కరించని పక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో విద్యుత్ ఉద్యోగులు అమర్నాథ్ రాజు, సిహెచ్ శివకుమార్, రాజేష్


నిరసన తెలుపుతున్న విద్యుత్ ఉద్యోగులు



బిట్రా జయంతిని సత్కరిస్తున్న అసోసియేషన్ సభ్యులు

ఉత్తమ ఉపాధ్యాయురాలు జయంతికి సత్కారం

ప్రజాశక్తి - భట్టిప్రోలు

మండలంలోని పల్లెకోన, కట్టుపల్లి యోహాను ఎడ్యుకేషన్ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్గా సేవలందిస్తున్న బిట్రా జయంతికి 2025 బెస్ట్ టీచర్స్ అవార్డు లభించింది. పురస్కారాన్ని ఎపి ఎం ఎడ్స్ ప్రాస్పెరిటీ అసోసియేషన్ (ఎపిఎంపిఎ) ఆధ్వర్యంలో పల్లెకోనలో ఇంగ్లీష్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్గా సేవలందిస్తున్న ఆమెకు ఉత్తమ ఉపాధ్యాయురాలు అవార్డు రావడం పట్ల కళాశాల యాజమాన్యం అభినందనలు తెలిపారు. ఆమెకు రాజ్య పురస్కార్ అవార్డును గవర్నర్ నుండి, రాష్ట్రపతి అవార్డును ప్రెసిడెంట్ నుండి స్కౌట్స్ అండ్ గైడ్స్ రంగంలో అందుకున్నట్లు తెలిపారు. ఆమె ఎన్సిసి సర్టిఫికేట్ కూడా పొందారు. ఆమె కావూరు ఎపిఆర్ పాఠశాలలో గైడ్ టీచర్గా, పిజిటిగా, అనంతరం అసిస్టెంట్ ప్రొఫెసర్గా విశిష్ట సేవలు అందించారు. ప్రస్తుతం ఆమె పాఠశాలలో మెంటల్ హెల్త్ అండ్ కెరీర్ కౌన్సిలర్గా విద్యార్థులకు మార్గనిర్దేశం చేస్తున్నారు. భట్టిప్రోలు టీఎం రావు హైస్కూల్లో విద్యనభ్యసించిన ఆమె సాధారణ చేనేత కుటుంబం నుండి వచ్చారు. కష్టసాధ్యమైన శ్రమతో విద్యా రంగంలో విశేష కీర్తి సాధించారని వివరించారు. ఆదర్శంగా నిలుస్తూ విద్యార్థుల భవిష్యత్తు నిర్మాణంలో తనదైన ముద్ర వేసిన బిట్రా జయంతికి అవార్డు దక్కడం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నారు.

డివిజన్ స్థాయి పోటీలకు కబడ్డీ జట్ల ఎంపిక

ప్రజాశక్తి - చెరుకుపల్లి

క్రీడలు విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసి వారి అభ్యున్నతికి దోహదం చేస్తుందని ఎంఇఒ పి లాజర్ అన్నారు. స్థానిక జెడ్పి ఉన్నత పాఠశాల్లో ఎస్జిఎఫ్ మండల స్థాయి క్రీడా పోటీలు సోమవారం నిర్వహించారు. ఈ పోటీల్లో భాగంగా సీనియర్, జూనియర్ విభాగాల్లో కబడ్డీ జట్లను డివిజన్ స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల నుండి విద్యార్థులు పోటీలకు హాజరుకాగా వారిలో ఒక్కొక్క టీంకు 12 మంది చొప్పున జూనియర్, సీనియర్ విభాగాల్లో క్రీడాకారులను ఎంపిక చేశారు. ఎంపికైన టీంల ద్వారా డివిజన్ స్థాయి పోటీల్లో మండలం తరఫున ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎం కాటూరి లక్ష్మీనారాయణ, పిఇటిలు కె శ్రీనివాసరావు, తుమ్మ బుచ్చిరెడ్డి, కోరేటి సత్యనారాయణ, లచ్చి పద్మావతి, తరుణ్, గ్రేట్ పాఠశాలల పిఇటి పాల్గొన్నారు.


ఎంపికైన కబడ్డీ జట్లతో ఎంఇఓ పి లాజర్


వినతి పత్రం అందజేస్తున్న కార్మికులు

పారిశుధ్య కార్మికులకు వేతనాలు ఇవ్వాలి

ప్రజాశక్తి - కొల్లూరు

మండలంలోని అన్ని పంచాయతీల్లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు ఎటువంటి సహకారం అందడం లేదని ప్రజా విజ్ఞప్తుల కార్యక్రమంలో తహశీల్దార్ బి వెంకటేశ్వర్లుకు సిఐటియు నాయకులు వినతి పత్రం సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు బొనిగల సుబ్బారావు మాట్లాడుతూ మున్సిపాలిటీల్లో పారిశుధ్య కార్మికులకు రూ.21వేలు వేతనం ఇస్తున్న ప్రభుత్వం అదే పనులు పంచాయితీల్లో చేస్తున్న పారిశుధ్య కార్మికులకు రూ.10వేలు మాత్రమే ఇస్తున్నారని అన్నారు. మండలంలో కొన్ని గ్రామాల్లో రూ.3500 నుండి రూ.6వేలు మాత్రమే ఇస్తున్నారని అన్నారు. మున్సిపాలిటీ కార్మికులకు పంచాయతీ కార్మికులకు పనిలో తేడా లేదని, వేతనంలో తేడా ఎందుకు చూపిస్తున్నారని ప్రశ్నించారు. టెండర్ల విషయంలో హైకోర్టు ఇచ్చిన తీర్పు అమలు చేయాలని కోరారు. కార్మికులు అందరికీ బట్టలు, సబ్బులు, కొబ్బరి నూనె, చెప్పులు ఇవ్వాలని కోరారు. కార్మికులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని, వేతనం ఇవ్వాలని, 1999లో జారీ చేసిన 551 జిఒ ప్రకారం అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్మికులు, సిఐటియు నాయకులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న బొనిగల సుబ్బారావు

గుర్తింపు కార్డులపై అవగాహన

ప్రజాశక్తి - కొల్లూరు

కొల్లూరు ఎస్టి కాలనీలో (యానాదులు) వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఆధార్, రేషన్, జాబ్ కార్డులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బొనిగల సుబ్బారావు మాట్లాడారు. స్వాతంత్రం వచ్చి 78ఏళ్లయినప్పటికీ నేటికీ కాలనీలు, గ్రామాల్లో ఆధార్, రేషన్, ఉపాధి జాబు కార్డులు చాలా మందికి రాని పరిస్థితి ఉందని అన్నారు. ఈ కార్డు లేకపోతే సొసైటీలో మనుషులుగా గుర్తించరని అన్నారు. ప్రభుత్వం నుంచి వచ్చే ఎటువంటి పథకం వర్తించదని తెలిపారు. దీనిపై ఎస్టీ కాలనీవాసులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఈఆర్ఓ చిట్టిబాబు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.


విద్యుత్ మోటర్ బహూకరిస్తున్న దాత

విద్యుత్ మోటారు బహూకరణ

ప్రజాశక్తి - బాపట్ల

పట్టణంలోని ఆజాద్ మున్సిపల్ మోడల్ ప్రైమరీ పాఠశాలకు నీటి సౌకర్యం కల్పించేందుకు బాపట్లకు చెందిన దాత డాక్టర్ చల్లా రామమోహనరావు విద్యుత్ మోటారు బహూకరించారు. పాఠశాలలో సోమవారం జరిగిన కార్యక్రమంలో రూ.7వేల విలువైన విద్యుత్ మోటారును పాఠశాలకు ఉచితంగా అందజేశారు. పాఠశాల అభివృద్ధికి సంబంధించి కృషి చేస్తానని ఆయన తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి స్వచ్ఛందంగా దాతలు ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం పివి సాంబశివరావు, ఉపాధ్యాయులు జి ప్రసాదరావు, బి ఎస్ రామకృష్ణ, మల్లేష్, పివి రమణ, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మార్కాపురం మెడికల్ కాలేజీని ప్రభుత్వమే నిర్మించాలి

- పీపీపీ పద్ధతిన చేపట్టడం తగదు
- సిపిఎం జిల్లా కమిటీ



వైద్య కళాశాల భవనాలను పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు (ఫైల్)

ప్రజాశక్తి- ఒంగోలు సిటీ

మార్కాపురం ప్రభుత్వ వైద్య కళాశాలను పీపీపీ పద్ధతిన బదలాయించడం తగదని, ప్రభుత్వమే నిర్మాణ బాధ్యతలు చేపట్టి నిర్వహించాలని సిపిఎం జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. జిల్లా కమిటీ కమిటీ తరపున నిర్ణయించిన అంశాలను జిల్లా కార్యదర్శి ఎస్కె.మాబు సోమవారం పత్రికలకు విడుదల చేశారు. గత ప్రభుత్వం నిర్మాణం చేపట్టిన వైద్య కళాశాలలను పీపీపీ పద్ధతిన ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించే చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు జిల్లా కమిటీ ప్రకటించిందన్నారు. 2021లో నేషనల్ మెడికల్ కౌన్సిల్ మంజూరు చేసి, ఇంకా పూర్తి కాని 10 వైద్య కళాశాలలో మార్కాపురం ఒకటి అన్నారు. గత ప్రభుత్వం హయాంలో కళాశాలకు అవసరమైన 50.33 ఎకరాలు స్థలం సేకరించినట్లు పేర్కొన్నారు. రూ. 475కోట్ల వ్యయ అంచనాతో 500 బెడ్లు, 150 మెడికల్ సీట్లకు అనువుగా భవన నిర్మాణాన్ని హైదరాబాద్‌కు చెందిన మేఘా ఇన్ఫ్రాస్ట్రక్చర్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ టెండర్ దక్కించుకున్నట్లు తెలిపారు. గత ఏడాది జూన్ నాటికి 40 నుంచి 50 శాతం భవన నిర్మాణ పనులు పూరైనట్లు తెలిపారు. నేషనల్ మెడికల్ కౌన్సిల్ సూచనల కనుగుణంగా వైద్య కళాశాలకు అవసరమైన ఫ్యాకల్టీని కూడా నియమించినట్లు ఈ సందర్భంగా గుర్తు చేశారు. మధ్యంతరంగా మెడికల్ కౌన్సిల్ బందం పర్యటించి పలు సూచనలు చేసిందన్నారు. 2024 శాసనసభ ఎన్నికల అనంతరం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం వైద్య కళాశాల నిర్మాణం పూర్తి చేయాల్సిన భాద్యత చేపట్టకుండా మార్కాపురం వైద్య కళాశాలకు కేటాయించిన సిబ్బందిని బదిలీ చేసినట్లు తెలిపారు. దీంతో వైద్య కళాశాల పనులు నిలిచి పోయినట్లు పేర్కొన్నారు. గత ప్రభుత్వం ఒప్పందం ప్రకారం ఆర్ఐడిఎఫ్ నిధుల ద్వారా నిర్మాణం పూర్తి చేసే ప్రక్రియను చేపట్టాల్సిన కూటమి ప్రభుత్వం టెండర్ గడువుకు ముందే రద్దు చేయడం, సిబ్బందిని బదిలీ చేయడం, పిపిపి పద్ధతిలో ప్రైవేట్ వాళ్లకి అప్పగించడం వంటి ఏకపక్ష నిర్ణయాలను సిపిఎం జిల్లా కమిటీ వ్యతిరేకిస్తుందన్నారు. రాష్ట్రంలోనే వెనుకబడిన ప్రకాశం జిల్లాలో అత్యంత వెనుకబడిన పశ్చిమ ప్రాంత వాసుల చిరకాల వాంఛగా ఉన్న వైద్య కళాశాల నిర్మాణాన్ని నిర్లక్ష్యం చేయడం తగదన్నారు. ఈ పాటికే సెల్ఫ్ ఫైనాన్స్ పేరుతో ఉన్నత విద్యను పేదలకు దూరం చేసిన ప్రభుత్వాలు వైద్య విద్యలో పీపీపీ పేరుతో ప్రైవేట్ వ్యక్తులను భాగస్వాములను చేస్తే వైద్య విద్య పేదలకు దూరం అవుతుందని కమిటీ అభిప్రాయపడిందన్నార. మార్కాపురం, యర్రగొండపాలెం, గిద్దలూరు ప్రాంతాల్లో రోడ్డు ప్రమాదాలు సంభవించినపుడు, గుండెజబ్బులు, బ్రెయిన్ స్ట్రోక్ వంటి అత్యవసర వైద్యం కోసం వందలాది కిలోమీటర్ల దూరంలోని గుంటూరు, ఒంగోలు, కర్నూలు, విజయవాడ వెళ్లాల్సిన తరుణంలో అనేక ప్రాణాలు కోల్పోయిన ఘటనలు అనేకం ఉన్నాయని గుర్తు జిల్లా కమిటీ చేసింది. మార్కాపురం ప్రాంత ప్రజల ఆకాంక్ష అయిన మార్కాపురం ప్రభుత్వం వైద్య కళాశాల నిర్మాణం పీపీపీ పద్ధతిన ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టే యత్నాలను పక్కన బెట్టి రాష్ట్ర ప్రభుత్వమే నిర్మాణం, నిర్వహణ భాద్యతలు చేపట్టాలని జిల్లా కమిటీ డిమాండ్ చేసినట్లు ఎస్కె. మాబు పేరొన్నారు.

టిడ్కో ఇళ్ల నిర్మాణానికి రూ.180 కోట్లు కేటాయించాలి

ఎమ్మెల్యే హామీ నిలబెట్టుకోవాలి : సిపిఎం

ప్రజాశక్తి - ఒంగోలు సిటీ

పట్టణ పేదలకు గృహాలు కట్టిస్తామన్న ప్రభుత్వ హామీ మేరకు తక్షణమే రూ.180 కోట్లు కేటాయించి టిడ్కోఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలని సిపిఎం డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ పార్టీ నగర కార్యదర్శి చీకటి శ్రీనివాసరావు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. టిడ్కో 2018లో అధికారంలో ఉన్న టిడిపి ప్రభుత్వం (పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ) ప్రాజెక్టు కింద 4,120 మందికి అపార్ట్‌మెంట్ల తరహాలో నిర్మాణం చేపట్టి ఏడేళ్లు గడిచిందన్నారు. ఇళ్ళ అంశం లబ్ధిదారులకు కలగానే మిగిలిపోయిందన్నారు. తిరిగి అధికారం చేపట్టిన టిడిపి టిడ్కో ఇళ్ల నిర్మాణం పూర్తి చేస్తామని హామీ ఇచ్చినట్లు గుర్తు చేశారు. ఇటీవల నిర్వహించిన నగర పాలక సంస్థ కౌన్సిల్ సమావేశంలో ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ రావు ఆరు నెలల్లో ఇళ్లు పూర్తి చేస్తాం, బ్యాంకులకు డబ్బు చెల్లించవద్దని హామీ ఇచ్చారని, ఆ హామీ నెరవేర్చాలంటే కనీసం రూ.180 కోట్లు వెంటనే కేటాయించాల్సిన అవసరం ఉందని గుర్తు చేశారు. అక్కడ చేపట్టిన కట్టడాలు ప్రమాదకరంగా ఉన్నట్లు తెలిపారు. నీరు, రోడ్లు, కరెంటు, డ్రైనేజీ సదుపాయాలు లేవని,చిల్లచెట్లు పెరిగి పాముల సంచారంతో అడవిలా తలపిస్తుందన్నారు. వైసిపి హయాంలో అగ్రహారం వద్ద 20 వేల మందికి సెంటు చొప్పున ఇచ్చిన ఇంటి స్థలాల స్థానం లో అర్హులైన వారందరికీ 2,సెంట్లు చొప్పున స్థలాలు ఇస్తామన్న హామీ అమలు కాలేదని విమర్శించారు. నగరంలో తాగునీటి సమస్య ఇంకా జఠిలంగానే ఉందన్నారు. శివారు కాలనీలకు కనీసం మూడు రోజులకు కూడా ట్యాంకర్ల ద్వారా నీరు అందించ లేని దుస్థితి లో పాలకవర్గం ఉందని ఆరోపించారు. డ్రైనేజ్ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండటంతో కొద్దిపాటి వానలకే వర్షపునీరు రోడ్డు పైకి రావడం, మురుగు ఏర్పడుతుందన్నారు. నగరంలో కుక్కల బెడద తీవ్రంగా ఉందని,కుక్కలను అరికట్టాలని డిమాండ్ చేశారు. నగర పరిధిలో 27 పార్కులు ఉన్నప్పటికీ వాకర్స్‌కి, పిల్లలకు కనీస సదుపాయాలు లేవన్నారు. జిమ్‌లు, టాయిలెట్లు సౌకర్యం కల్పించాలన్నారు. రోడ్లు, శ్మశాన వాటికల సమస్య, మసీదులు, చర్చిల వద్ద కనీస వసతులు లేకపోవడం లాంటి సమస్యలు ఉన్నాయన్నారు. ఈ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు .లేని పక్షాన ప్రజలను సమీకరించి పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని ఆయన హెచ్చరించారు.

చట్టపరిధిలో అర్జీలకు పరిష్కారం

బాపట్ల జిల్లా ఎస్పి బి.ఉమామహేశ్వర్



బాపట్లలో అర్జీదారులతో మాట్లాడుతున్న ఎస్పి ఉమామహేశ్వర్

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని ఎస్పి బి.ఉమామహేశ్వర్ అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా 54 మంది అర్జీదారులు తమ సమస్యలు విన్నవించుకున్నారు. చట్టపరిధిలో విచారించి అర్జీలు పరిష్కరిస్తామని ఎస్పి అర్జీ దారులకు భరోసా కల్పించారు.. భర్త, అత్తారింటి వేధింపులు, భూ వివాదాలు, ఆర్థిక లావాదేవీల మోసాలు తదితర సమస్యలపై 54 మంది అర్జీలు అందజేశారు. ఎస్పి అర్జీదారులతో ముఖాముఖీగా మాట్లాడి వారి అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించారు. అర్జీలను విచారించి చట్ట పరిధిలో పరిష్కరిస్తామని భరోసానిచ్చారు. పిజిఆర్ఎస్ ద్వారా వచ్చిన అర్జీలను నిర్దిష్ట గడువులోగా చట్టపరంగా విచారించి పరిష్కరించాలని ఎస్పి అధి కారులను ఆదేశించారు. అర్జీదారుల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఉపేక్షించ బోమనిహెచ్చరించారు. అర్జీల పరిష్కారానికి తీసుకున్న చర్యలపై నివేదికను జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయానికి పంపించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సిసిఎస్ డిఎస్పి పి. జగదీష్ నాయక్, పిజిఆర్ఎస్ సెల్ ఎస్ఐ ఏ. నాగేశ్వరరావు, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.



ఒంగోలులో అర్జీదారులతో మాట్లాడుతున్న పోలీసు అధికారులు

'మీకోసం'లో 58 అర్జీలు

ఒంగోలు సబర్బన్ : అడిషనల్ ఎస్పి కె.నాగేశ్వరరావు పర్యవేక్షణలో జిల్లా పోలీస్ కార్యాలయంలో మీకోసం కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా నలుమూలల నుంచి అర్జీదారులు వచ్చి తమ సమస్యలపై అర్జీలు అందజేశారు. పోలీసు అధికారులు అర్జీలు స్వీకరించి అర్జీదారులతో ముఖాముఖీగా మాట్లాడి వారి సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. అందిన ప్రతి అర్జీపై చట్ట ప్రకారం విచారణ జరిపి, సత్వర పరిష్కారం చూపుతామని బాధితులకు భరోసా కల్పించారు. అర్జీల వివరాలను సంబంధిత పోలీస్ అధికారులకు తెలియజేసి, త్వరితగతిన చట్ట ప్రకారం విచారణ జరిపి భాదితులకు న్యాయం అందించేలా చూడాలన్నారు. వివిధ సమస్యలతో పోలీస్ కార్యాలయాలకు వచ్చే బాధితులకు పోలీస్ శాఖ భరోసాగా ఉండాలన్నారు. భూ వివాదాలు, ఉద్యోగ మోసాలు, కుటుంబ కలహాలు, ఆర్థిక మోసాలు, చీటింగ్ కేసులు మరియు ఇతర సమస్యలపై ప్రజలు మొత్తం 58 అర్జీలు అందజేశారు. ప్రజల విశ్వాసం పెంపొందించడమే కాకుండా బాధితులకు తక్షణ సహాయం అందించడం పోలీస్ శాఖ ప్రధాన ధ్యేయమని అధికారులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మహిళ పోలీస్ స్టేషన్ డిఎస్పి రమణ కుమార్, మహిళా పోలీస్ స్టేషన్ సిఐ సుధాకర్, ఎస్సీ,ఎస్టీ సెల్ ఇన్‌స్పెక్టర్ దుర్గాప్రసాద్, సిసిఎస్ ఇన్‌స్పెక్టర్ జగదీష్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ పాండు రంగారావు, ప్రజా సమస్యల పరిష్కార వేదిక ఎస్ఐ జనార్ధన్ రావు పాల్గొన్నారు.



స్మార్ట్ రైస్ కార్డులను పంపిణీ చేస్తున్న ఇన్‌ఛార్జి జేసీ

స్మార్ట్ రైస్ కార్డులు పంపిణీ

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

స్మార్ట్ న్యూరైస్ కార్డుల ద్వారా బియ్యం పంపిణీ జరుగుతుందని ఇన్‌ఛార్జి సంయుక్త కలెక్టర్ జి.గంగాధర్ గౌడ్ తెలిపారు. కలెక్టరేట్‌లో స్మార్ట్ న్యూరైస్ కార్డులు సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి విడుదలైన స్మార్ట్ న్యూ రైస్ కార్డులను ప్రజల ఇంటి వద్దకే అందిస్తామని తెలిపారు. జిల్లాలో 1,123 చౌక ధరల దుకాణాలు ఉన్నట్లు తెలిపారు. వాటి పరిధిలో 4,71,382 రైస్ కార్డులు ఉన్నాయన్నారు. రైస్ కార్డులకు బదులుగా వాటి స్థానంలో స్మార్ట్ న్యూ రైస్ కార్డులు ప్రభుత్వం అందజేస్తున్నట్లు తెలిపారు. జిల్లాకు 4.71 లక్షల స్మార్ట్ న్యూరైస్ కార్డులు వచ్చాయన్నారు. సచివాలయాల ఉద్యోగులు ఇంటింటికీ తిరిగి న్యూ స్మార్ట్ కార్డులు అందజేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఒ పి. గ్లోరియా, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి అమీర్ బాషా, డి ఎల్‌డిఒ విజయమ్మ, సచివాలయాల కోఆర్డినేటర్ యశ్వంత్, ఉప కలెక్టర్ లవన్న, వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ విజయమ్మ, మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన జెసిఐ వారోత్సవాలు

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

స్థానిక కాపు కళ్యాణమండపంలో జూనియర్ ఛాంబర్ ఇంటర్నేషనల్ ఒంగోలు ఆధ్వర్యంలో ఈనెల 15న ప్రారంభమైన వారోత్సవాలు సోమవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ముగింపు కార్యక్రమంలో జెసిఐ ఇంటర్నేషనల్ కమిషన్ చైర్మన్ ఎన్‌బి హర్షవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ జెసి వారోత్సవాల నిర్వహణలో దేశంలోనే జెసిఐ ఒంగోలు ఘనమైన కీర్తిని కలిగి ఉందన్నారు. ఏ కార్యక్రమం చేయాలన్నా వారిదే అగ్రస్థానమని తెలిపారు జెసిఐ ఒంగోలు అధ్యక్షుడు మేడిశెట్టి వెంకట సుబ్బారావు మాట్లాడుతూ వారోత్సవాలలో సుమారుగా 70 పాఠశాలల నుంచి 5000 మంది విద్యార్థులు రకరకాల పోటీలలో పాల్గొన్నారన్నారు. జేసీ వారోత్సవాల చైర్మన్ జేసి శివకోటి రెడ్డి మాట్లాడుతూ వారోత్సవాలు నిర్వహణలో సహకరించిన ప్రతి పాఠశాల కరస్పాండెంట్ కు తన ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జెసిఐ వారోత్సవాల కో చైర్మన్లు గంధవళ్ళ బాలకష్ణ , శబరీనాథ్ నాయర్, సెక్రెటరీ శ్రీనివాసరావు, అనీల్ కుమార్, కోశాధికారి బాలసుబ్రమణ్యం, కసిబిసి నాగేశ్వరరావు , డాక్టర్ జి.రవికుమార్, జేసీఐ నేషనల్ పాస్ట్ ప్రెసిడెంట్ రామకష్ణ, ఐపిపి కె.వరుణ్ కుమార్, శ్రీ సరస్వతి విద్యా సంస్థల అధినేత ఏవి రమణారెడ్డి, శ్రీ హర్షిణి విద్యా సంస్థల అధినేత గోరంట్ల రవికుమార్, ప్రతిభ విద్యా సంస్థల అధినేత నల్లూరి వెంకటేశ్వర్లు, రమణ, సెక్రటరీ మాజేటి గణేష్, కోశాధికారి కసిబిసి వీర బ్రహ్మాం, రవీంద్ర పాల్గొన్నారు.

అవగాహన ఒప్పందం

ప్రజాశక్తి - ఒంగోలు సిటీ

ఆంధ్ర కేసరి యూనివర్సిటీ విద్యార్థుల నైపుణ్యాభివృద్ధి, మూక్స్ రూపకల్పన, అమలుకు సంబంధించి స్కిల్ డిజైర్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్‌తో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. యూనివర్సిటీ విసి ప్రొఫెసర్ డివిఆర్. మూర్తి సమక్షంలో ఈ ఒప్పందంపై సోమవారం సంతకాలు జరిగాయి. ఎకెయు తరపున రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బి. హరిబాబు, స్కిల్ డిజైర్ టెక్నాలజీస్ తరఫున అసిస్టెంట్ మేనేజర్ శ్రీకాంత్ సంతకాలు చేశారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ పరిధిలోని యుజి, పీజీ కళాశాలల విద్యార్థులకు నైపుణ్యాలు, సాంకేతిక విజ్ఞానం అందించడానికి, అవసరమైన మూక్స్ తయారీలో రెండు సంస్థలు కలిసి పని చేయనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎకెయు ఎసిఇ డాక్టర్ అంచుల భారతి దేవి, ఎసిఇ సహాయకుడు డాక్టర్ ఎన్. సురేష్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.


స్టాక్‌మార్కెట్ ముసుగులో సింగిల్ నంబర్ జూదం

ప్రజాశక్తి - వేటపాలెం

మార్కెట్‌లో స్టాక్ మార్కెట్ సెన్సెక్స్ పేరుతో జూదం బహిరంగంగా నడుస్తోంది. ప్రతిరోజూ ఉదయం 9 గంటలకు ప్రారంభమై మధ్యాహ్నం 3.32 గంటలకు ఫలితాలు ప్రకటించే ఈ ఆటలో రూ.లక్షలు చేతులు మారుతున్నాయి. సంఖ్యల అంచనాలు రాసిన వారిలో కొందరికి మాత్రమే ఆరు రెట్లు డబ్బులు వెనక్కి వస్తుండగా మిగతా వారు ఈ సారైనా రాకపోతుందదా అంటూ బోల్తా పడుతున్నారు.

ఈ ఆట ఎలా సాగుతోంది?

ఉదాహరణకు సెన్సెక్స్ 63,153.81 వద్ద ఆగితే చివరి అంకె '81' రాసినవారికే డబ్బులు వస్తాయి. ఈ ఆటను యాప్‌ల ద్వారా సాంకేతికంగా నడిపిస్తున్నా, వాస్తవానికి ఇది పక్కా జూదమే అని న్యాయ నిపుణులు స్పష్టం చేస్తున్నారు. పోలీసుల కళ్లముందే జూదం బహిరంగంగా నడుస్తోంది. ఎవరూ ఆపడం లేదు. ముడుపులు తీసుకుని కళ్లుమూస్తున్నారని స్థానికులు తీవ్రంగా విమర్శిస్తున్నారు. మండలంలో అత్యంత సమస్యాత్మకమైన ప్రాంతాలతోపాటు మండల కేంద్రంలో పదుల సంఖ్యలో పోలీసులు నిఘా నేత్రాలు నిరంతరం పనిచేస్తూనే ఉంటాయి. విచిత్రం ఏంటంటే ఈ నిఘానేత్రాల క్రిందనే వెంకటరెడ్డి, ఠాగూర్, శ్రీను, కాలేశా చుండూరి ఇలా ఉరఫ్ పేర్లతో రోజుకు రూ.లక్షల ఆట జరుగుతూ ఉంటుంది. ఎక్కువగా జరిగే రావూరుపేట, రామన్నపేట, పందిళ్ళపల్లి, దేశాయిపేట, రామానగర్, అక్కయ్యపాలెం, లక్ష్మీపురం ప్రాంతాల్లో కలిపితే రూ.కోట్లలో జూదం జరుగుతుంది. జూదనం నిషేధితమే ఈ తరహా ఆటలు చట్ట విరుద్ధమని న్యాయ నిపుణులు చెబుతున్నారు. యాప్‌ల ద్వారా నడుస్తున్నా, మూలంలో ఇది జూదమే కాబట్టి నిర్వాహకులు, సహకరించే వారందరిపై కేసులు నమోదు చేయాల్సి ఉందని చర్చిస్తున్నారు. అందుకు విరుద్ధంగా పోలీసుల మౌనం వహించటంలో గల అంతర్యం ఇట్టే తెలుసుకోవచ్చని బహిరంగంగానే చర్చిస్తున్నారు. ఈ గేంపై పోలీసులు మాత్రం మౌనంగా వ్యవహరిస్తుండటం ఆశ్చర్యం కలిగిస్తోంది. ప్రజల అనుమానాల ప్రకారం పెద్దఎత్తున ముడుపులు తీసుకుంటున్నారన్న ఆరోపణలు తెరపైకి వస్తున్నాయి. నిజంగా పోలీసులు కట్టుదిట్టంగా వ్యవహరించి ఉంటే ఈ జూదం ఒక్కరోజు కూడా సాగేది కాదు. సెన్సెక్స్ పేరుతో కొత్త తరహా జూదం విస్తరిస్తుండటంతో సమాజంలో యువత, కార్మికులు, చిన్న ఉద్యోగులు బలైపోతున్నారని ఆందోళన వ్యక్తమవుతోంది. ఇలాగే కొనసాగితే ఈ జూదం రాక్షసరూపం దాల్చి సమాజాన్ని కబళిస్తుందని అంటున్నారు. పోలీసులు కళ్లుమూసుకుంటే ఈ అక్రమం సమాజాన్ని నాశనం చేసే స్థాయికి చేరుతుందని ప్రజలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



ఆన్లైన్ యాప్‌లో నమోదైన లాటరీ అంకెలు


హిమబిందును అభినందిస్తున్న ఉపాధ్యాయులు

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి - వేటపాలెం

క్రీడల్లో రాణించి పాఠశాలకు మంచి పేరు, ప్రఖ్యాతులు తీసుకురావాలని ఇన్చార్జి హెచ్‌ఎం ఉమ్మిటి వేణుగోపాలరావు అన్నారు. స్థానిక బాలికోన్నత పాఠశాలలో సోమవారం అభినందన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా 51వ జూనియర్ బాలురు, బాలికల కబడ్డీ సెలక్షన్ బాపట్ల మున్సిపల్ హైస్కూల్ క్రీడా ప్రాంగణంలో ఆదివారం నిర్వహించినట్లు చెప్పారు. ఈ పోటీల్లో తమ పాఠశాల 9వ తరగతి విద్యార్థిని పి హిమబిందు జిల్లా తరపున రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. జిల్లా జట్టు ఈనెల 22 నుండి 25 వరకు విజయవాడలోని గొల్లపూడిలో జరుగు పోటీల్లో పాల్గొంటారని కబడ్డీ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి మంతెన సుబ్బరాజు చెప్పినట్లు వివరించారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన హిమబిందుకు స్టాఫ్ సెక్రటరీ కె సోమశేఖర్, పిఇటి జడ దేవబిక్షం, జరుబుల శ్రావణి అభినందనలు తెలిపారు.


అవార్డు అందుకుంటున్న శ్రీనివాసాచారి

శ్రీనివాసాచారికి ఐకాన్ అవార్డు

ప్రజాశక్తి - అద్దంకి

శ్రీ విరాట్ విశ్వకర్మ విజ్ఞాన ఆధునిక ధార్మిక కళాపరిషత్, ఇండియన్ కల్చరల్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్రం సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ రాజేశ్వరి కాన్ఫరెన్స్ హాల్లో జరిగిన సమావేశంలో విశ్వకర్మ ఐకాన్ జాతీయ అవార్డును ఉమ్మడి ప్రకాశం జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షులు చెన్నుపల్లి శ్రీనివాసాచారికి సిద్దిపేట వీరబ్రహ్మేంద్రస్వామి మఠం పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ వీరజ ధర్మేంద్ర స్వామి, బతుకమ్మ తల్లి గ్రంథకర్త వంగల శాంతి కృష్ణ చేతుల మీదుగా అందజేశారు. ప్రకాశం జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘ ప్రధాన కార్యదర్శి కుందుర్తి సీతారామాంజనేయులు, పల్నాడు జిల్లా టిడిపి సాధికార కమిటీ నాయకులు డికొండ వెంకటాచారి, టింబర్ వ్యాపారవేత్త బోగోలు శ్రీనివాసాచారి, సీనియర్ జర్నలిస్టు కన్నెకంటి శ్రీనివాసచారి, సంఘ నాయకులు చోడా వెంకట సుబ్బారావు, ఏలూరి వీర బ్రహ్మాచారి పాల్గొన్నారు.

విద్యుత్ ఎఇని నియమించండి

ప్రజాశక్తి - పర్చూరు

స్థానిక విద్యుత్ సబ్ డివిజన్ కార్యాలయంలో ఏర్పడిన ఎఈ పోస్ట్ ఖాళీలో ఎఈని నియమించాలని విద్యుత్ వినియోగదారులు, ప్రజలు కోరుతున్నారు. మండలంలో మేజర్, మైనర్ కలిపి 26 పంచాయితీలు ఉన్నాయి. ప్రతి గ్రామంలో ప్రతిరోజు ఏదో ఒక విద్యుత్ సమస్య వస్తుంది. గతంలో ఎఈగా పని చేసిన రమేష్ బదిలీపై వెళ్లిపోయారు. తక్షణమే ఎఈ పోస్టు భర్తీ చేసి గ్రామాల్లో విద్యుత్ సమస్యలు పరిష్కారం చేయాలని ప్రజలు కోరుతున్నారు.

18న శతక పద్య పోటీలు

ప్రజాశక్తి - పంగులూరు


మండలంలోని కోటపాడు జెడ్‌పి ఉన్నత పాఠశాలలో ఈనెల 18న మండల స్థాయిలో శతక పద్య పోటీలు జరుగుతాయని హెచ్‌ఎం వడ్లమూడి వేణుబాబు సోమవారం తెలిపారు. గుర్రం వెంకటేశ్వర్లు తండ్రి రామలింగం స్మారకార్థం ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పోటీలకు ప్రతి పాఠశాల నుండి ఒక్కో విభాగంలో ఒక విద్యార్థికి అవకాశం ఉంటుందని, 4, 5 తరగతులకు, 6, 7 తరగతులకు వేమన శతకం, 8, 9 తరగతులకు సుమతి శతకంకు సంబంధించి పోటీలు జరుగుతాయని చెప్పారు.

రోటరీ ఆధ్వర్యంలో విత్తన బంతులు తయారీ

ప్రజాశక్తి - పంగులూరు

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక జెడ్‌పి ఉన్నత పాఠశాల విద్యార్థులకు విత్తన బంతులు తయారు చేయు విధానాన్ని సోమవారం వివరించారు. విత్తన బంతులు ద్వారా చెట్లను సులభంగా పెంచవచ్చని రోటరీ అధ్యక్షులు డాక్టర్ బత్తుల వీరనారాయణ తెలిపారు. ఎర్ర మట్టిలో కంపోస్ట్ ఎరువులు కలిపి వాటిని బంతులుగా తయారు చేసి అందులో ఒక విత్తనం వేసి రోడ్ల వెంట, చెట్లు లేని ప్రాంతాల్లో నాటితే సులభంగా మొలకలు వచ్చి చెట్లుగా మారే అవకాశం ఉందని అన్నారు. గానుగ, తురాయి, వేప, నేరేడు, అఫీషియ, మొదలైన చెట్లకు చెందిన విత్తనాలను విత్తన బంతుల్లో పెట్టామని చెప్పారు. చెట్లను పెంచడం వలన జీవవైవిధ్యం పెరుగుతుందని అన్నారు. ఇది మానవ జాతికి ఎంతో ఉపయోగమని చెప్పారు. ప్లాస్టిక్ కవర్లలో మొక్కలు పెంచడం వలన పర్యావరణానికి ఎంతో నష్టమని, విత్తన బంతుల వలన పర్యావరణానికి మేలు జరుగుతుందని చెప్పారు. మానవజాతి ఆరోగ్యంగా, సుఖ సంతోషాలతో పది కాలాలపాటు ఈ భూమి మీద జీవించాలంటే పర్యావరణాన్ని కాపాడవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిదని అన్నారు. విద్యార్థులు విత్తన బంతులు తయారు చేసి రోడ్ల వెంట, ఖాళీ ప్రదేశాల్లో వేయమని చెప్పినట్లు తెలిపారు. కొండమంజులూరు జెడ్‌పి ఉన్నత పాఠశాల్లోనూ విత్తన బంతుల తయారీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ ట్రెజరర్ కాలి షావలి, రిటైర్డ్ లెక్చరర్, రోటరీ క్లబ్ ఆఫ్ చిలకలూరిపేట సభ్యులు డి లక్ష్మీనారాయణ, పంగులూరు హైస్కూల్ ఇన్చార్జి హెచ్‌ఎం రావి శ్రీనివాసరావు, కొండమంజులూరు పాఠశాల హెచ్‌ఎం ఇమ్మడిశెట్టి అనిత, ఎన్ఎస్ టీచర్ మేరీ శ్యామల, పిఎస్ టీచర్ శ్రీనివాస్ కుమార్ పాల్గొన్నారు.


విత్తన బంతులు తయారు చేస్తున్న దృశ్యం


మాట్లాడుతున్న ఎంఇఒ చిలుకూరి గోపి

కుర్చీలు, బల్లలు బహూకరణ

ప్రజాశక్తి - యద్దనపూడి

మండలంలోని గన్నవరం ప్రాథమిక పాఠశాలకు (ఎస్‌సి) అదినే చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బల్లలు, కుర్చీలు సోమవారం బహుకరించారు. రూ.10వేల విలువ చేసే పర్నీచర్‌ను అందించి నందుకు విద్యార్థుల తల్లి, దండ్రులు ట్రస్ట్ ప్రతినిధులను అభినందించారు. ఈ సందర్భంగా ఎంఇఒ చిలుకూరు గోపి మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలకు దాతలు సహకరించడం అభినంద నీయమని అన్నారు. దాతల ఉద్దేశాన్ని ఉపాధ్యాయులు అర్థం చేసుకుని మెరుగైన విద్యాబోధన చేయాలని సూచించారు. దాత లేలపల్లి సుధీర, వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పాఠశాల విద్యార్థులకు సేవ చేయటం ఆనందంగా ఉందన్నారు. విద్యార్థులు చదువుతో పాటు ఆట, పాటల్లోనూ ముందు ఉండే విధంగా చూడాలని సూచించారు. దాతలను సత్కరించారు. పోపూరి సునీల్, రెహమాన్, సిఆర్‌పి ప్రేమ కుమార్ పాల్గొన్నారు.

ఖాదర్ ఖాన్ సెంటర్ వరకు ఆర్‌టిసి బస్సులు నడపాలి

ప్రజాశక్తి - చెరుకుపల్లి

చెరుకుపల్లి ప్రధాన సెంటర్లలో ఒకటైన ఖాదర్ ఖాన్ సెంటర్ వరకు తెనాలి డిపో ఆర్టీసీ బస్సులు నడపాలని స్థానికులు అధికారులు, ప్రజాప్రతినిధులకు విజ్ఞప్తి చేస్తున్నారు. తెనాలి డిపో బస్సులు చెరుకుపల్లి సెంటర్లోని ప్రధాన రహదారైన ఐ లాండ్ సెంటర్ వరకు మాత్రమే వచ్చి వెను తిరగడంతో గ్రామస్తులు అధిక శాతం ఇబ్బందులకు గురవుతున్నారని పేర్కొన్నారు. గతంలో బస్సులు సంత బజార్ సమీపం వరకు వస్తూ ఉండగా గత కొన్నేళ్లుగా చెరుకుపల్లి గ్రామ మొదటిలో ఉన్న ఐ లాండ్ సెంటర్ వరకు మాత్రమే వచ్చి వెళుతున్నాయి. దీంతో ప్రజలు, మహిళలు, వృద్ధులు ఐ లాండ్ సెంటర్ నుండి ప్రైవేట్ వాహనాల ద్వారా తెనాలి బస్సుల కోసం వెళుతూ ఇబ్బందులకు గురవుతున్నారని, ఖాదర్ ఖాన్ సెంటర్ వరకు తెనాలి డిపో బస్సులు నడపాలని ప్రజలు కోరుతున్నారు. మంత్రి అనగాని సత్యప్రసాద్, ఎంపిడిఒ, తహశీల్దారు, తెనాలి, రేపల్లె డిపో మేనేజర్లకు వినతి పత్రాలు అందజేశారు. ఎక్కువ దూరం నడవాల్సి వస్తుందని పేర్కొన్నారు. రేపల్లె, తెనాలి వైపు నుండి వెళ్లే ప్రయాణికులు ఖాదర్ ఖాన్ సెంటర్ వద్ద దిగాలంటే సమీపంలోని సంధుల, రాంబట్లపాలెం సెంటర్ల వరకు అదనపు టికెట్లు జారీ చేస్తూ అధిక చార్జీలు వసూలు చేస్తున్నారని చెబుతున్నారు. దీనిని నియంత్రించాలని స్థానికులు గండే సాంబశివరావు, సిపిఐ ఎంఎల్ నాయకులు మత్రివాడ వెంకటరావు కోరారు.


రికార్డులు ఎంఇఒ శ్రీనివాసరావు

మెరుగైన బోధన అందించాలి

ప్రజాశక్తి - అద్దంకి

స్థానిక సత్రం పాఠశాలను ఎంఇఒ కెవి శ్రీనివాసరావు సోమవారం సందర్శించారు. తరగతుల వారీగా పాఠశాల్లోని విద్యార్థుల సామర్థ్యలను పరశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. భవిత కేంద్రంలో ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులతో కొద్దిసేపు ముచ్చట్టించారు. వారి అభివృద్ధికి ప్రభుత్వం అందిస్తున్న పథకాలు గురించి, భవిత కేంద్రంలో అందిస్తున్న సేవల గురించి ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. కేంద్రంలో రికార్థులు పరశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకం అమలు తీరుపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. రోజు వారీ మెనూ పరిశీలించారు. రుచికరమైన భోజనం అందించాలని చెప్పారు. ఉత్తమ బోధనతో విద్యార్థులను తీర్చి దిద్దాలని సూచించారు. తదుపరి ఉపాధ్యాయుల సమావేశం ఏర్పాటు చేసి సూచనలు సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో హెచ్‌ఎం గర్నెపూడి శ్యామ్ కుమార్, ఎం ధనలక్ష్మి, జె బాబురావు, కొంగల శ్రీనివాసరావు, పాలపర్తి యోనా, ఇందిరా ప్రియదర్శిని పాల్గొన్నారు.


నాగయ్య మృత దేహానికి నివాళులర్పిస్తున్న అశోక్ బాబు

వైసిపి నాయకుడు నాగయ్య మృతి

ప్రజాశక్తి - భట్టిప్రోలు

మండలంలోని ఆళ్లమూడి గ్రామానికి చెందిన వైసిపి నాయకులు కనపర్తి నాగయ్య అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన మృతి సమాచారం తెలుసుకున్న వైసీపీ ఇన్‌ఛార్జి వరికూటి అశోక్ బాబు వైసిపి నాయకులతో కలిసి నాగయ్య మృత దేహానికి నివాళులర్పించారు. నాగయ్య కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. వైసిపి రైతు విభాగ రాష్ట్ర కార్యదర్శి గాదె శివరామకృష్ణరెడ్డి, వైసిపి మండల కన్వీనర్ పడమటి శ్రీనివాసరావు, పల్లెకోన సర్పంచ్ బొల్లేద్దు ప్రతాప్ తదితరులు ఉన్నారు.

18న మండల స్థాయి ఆటల పోటీలు

ప్రజాశక్తి - పంగులూరు

ఈ నెల 18 నుండి రెండు రోజుల పాటు మండలంలోని చందలూరు జెడ్‌పి ఉన్నత పాఠశాలలో మండల స్థాయి ఆటల పోటీలు జరుగుతాయని పాఠశాల హెచ్‌ఎం చందలూరు గిరిజ సోమవారం తెలిపారు. మండలంలోని వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఈ ఆటల పోటీల్లో పాల్గొనవచ్చని అన్నారు. 18, 19 తేదీల్లో పోటీలు జరుగుతాయని చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల పిడిలు కె మధు, కె ప్రతిమ పాల్గొన్నారు.

వ్యవసాయ సాంకేతిక విద్యలో విశ్వ ఖ్యాతి ఆర్జించాలి



ఎజి ఇంజనీరింగ్ కళాశాల్లో ఇంజనీర్స్ డే వేడుకలు

ప్రజాశక్తి - బాపట్ల

వ్యవసాయ సాంకేతిక విద్యలో విశ్వ ఖ్యాతి ఆర్జించాలని బాపట్ల వ్యవసాయ ఇంజనీరింగ్ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ డిడి స్మిత్ అన్నారు. వ్యవసాయ ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన ఇంజనీర్స్ డే సందర్భంగా ప్రఖ్యాత ఇంజనీరు మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఆహార విజ్ఞాన కళాశాల అసోసియేట్ డీన్ ఎం సర్దార్ బేగ్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి మేధా నైపుణ్యంతో సామాన్య ప్రజానీకానికి ఉపయోగపడే సాంకేతికతను తయారు చేయడం ద్వారానే ఇంజనీరింగ్ విద్యకు సార్ధకత చేకూరుతుందని అన్నారు. కె కృపావతి, బి రవి బాబు, కెవిఎస్ రామిరెడ్డి, బి శ్రీనివాసరెడ్డి, డాక్టర్ ఎల్ ఏడుకొండలు, విశ్రాంత ఆచార్యులు శివకుమార్, డి భాస్కరరావు పాల్గొన్నారు.

వేటపాలెం : స్థానిక సెయింట్ ఆన్స్ ఇంజనీరింగ్ కాలేజీలో ఐఎస్‌టిఇ ఆధ్వర్యంలో ఇంజనీర్స్ డే వేడుకలు సోమవారం నిర్వహించినట్లు కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణా రావు, కరస్పాండెంట్ ఎస్ లక్ష్మణరావు తెలిపారు. భారత రత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య జన్మదిన వేడుకలు నిర్వహించినట్లు తెలిపారు. డి ప్రసాదరావు, బాపట్ల ఆర్ అండ్‌బి ఎఇ పి చంద్రశేఖర్, హైదరాబాద్ కావేరి ఇంజినీరింగ్ ప్రాజెక్ట్స్ లిమిటెడ్ జిఎం డి నళిని సందేశాలు ఇచ్చారు. డాక్టర్ సి సుబ్బారావు, మేనేజర్ ఆర్‌వి రమణమూర్తి, ఐఎస్‌టిఈ సెక్రటరి డాక్టర్ పివిఎస్ శర్మ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సెయింట్ ఆన్స్ ప్రిన్సిపల్ డాక్టర్ జగదీష్



ఇంజనీర్ డే వేడుకల్లో సన్మానిస్తున్న సిఇసి యాజమాన్యం

చీరాల : స్థానిక చీరాల ఇంజినీరింగ్ కళాశాల (అటానమస్) లో భారత రత్న ఇంజనీర్ మొక్షగుండం విశ్వేశ్వరయ్య 164వ జయంతి సందర్భంగా సోమవారం ఇంజనీర్ల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ప్రముఖ ఇంజనీర్ వ్యాపారవేత్త పి రామకృష్ణ, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి జగదీశ్, కళాశాల కార్యదర్శి రవికుమార్ మాట్లాడుతూ క్రమశిక్షణతో కూడిన చదువులే మంచి సమాజాన్ని నిర్మి స్తాయని చెప్పారు. ఎం వేణు ప్రసాద్ నిర్వాహకులను అభినందించారు. పి రామకృష్ణను సత్కరించారు. వివిధ పోటీల్లో విజయం సాధించిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. నిర్మాణాల్లో ఇంజనీర్ల కృషి ఎనలేనిదని మునిసిపల్ చైర్మన్ మించాల సాంబశివ రావు అన్నారు. మోక్షగుండం విశ్వేశ్వరయ్య 164వ జయంతిని సందర్భంగా మున్సిపల్ కార్యాలయంలో ఇంజనీర్స్ డే నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ పొత్తూరి సుబ్బయ్య, శరత్, విజయ భాస్కరరెడ్డి పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న చైర్మన్ సాంబశివరావు



వినతులు స్వీకరిస్తున్న రేపల్లె ఆర్‌డిఒ రామలక్ష్మి

ఫిర్యాదుల పరిష్కారంపై శ్రద్ధ పెట్టండి

ప్రజాశక్తి - రేపల్లె

ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా స్వీకరించిన ఫిర్యాదులు పరిష్కరించడంపై శ్రద్ధ పెట్టాలని ఆర్‌డిఒ ఎన్ రామలక్ష్మి అధికారులను ఆదేశించారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్వీకరించిన అర్జీలను క్షుణ్ణంగా చదివి క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ఐదు అర్జీలు అందాయని తెలిపారు. ఆయా శాఖల అధికారులకు పరిష్కారం నిమిత్తం పంపించినట్లు తెలిపారు.

18న గ్రంథాలయ కమిటీ నియామకం

ప్రజాశక్తి - బాపట్ల

బాపట్ల శాఖ గ్రంథాలయం అభివృద్ధికి గ్రంథాలయ కార్యదర్శి ఆదేశాల మేరకు నూతన కమిటీని ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నట్లు గ్రంథాలయం అధికారి ఎ శివాజీ గణేశన్ సోమవారం తెలిపారు. ఈనెల 18న గ్రంథాలయంలో నూతన కమిటీ ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. గ్రంథాలయ అభివృద్ధికి తోడ్పాటు అదించే ఈ కమిటీ ఏర్పాటులో విద్యా వేత్తలు, పెద్దలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొనాలని శివాజీ గణేష్ కోరారు.



ఎంపికైన క్రీడాకారులతో ఉపాధ్యాయులు

కబడ్డీ పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి - భట్టిప్రోలు

స్థానిక టిఎం రావు ఉన్నత పాఠశాల్లో మండల స్థాయి వాలీబాల్, కబడ్డీ బాల, బాలికలకు అండర్ 14, 17 క్యాటగిరిల్లో ఆటలు పోటీ లు సోమవారం నిర్వహించారు. స్థానిక పిహెచ్‌సి వైద్యా ధికారిణి డాక్టర్ మొహిసిన తాజ్, సిహెచ్‌ఓ మంగరాజు, ఎఎస్‌ఐ రామకృష్ణ, హెడ్ కానిస్టేబుల్ సైకం నాగరాజు క్రీడలను ప్రారంభించారు. పాఠశాల కరస్పాండెంట్ పులి కొండ మల్లికార్జునరావు, హెచ్‌ఎం చందలూరి రామకోటే శ్వరరావు, కో ఆర్డినేటర్ చేబ్రోలు శ్రీనివాసరావు, పిఇటిలు మహమ్మద్ అనూల్ హుక్, సూరేపల్లి నాగేశ్వరరావు, శ్రీనివాసరెడ్డి, పడమటి బాబు, హరిప్రసాద్, వీర్ల శ్రీనివాసరావు, పద్మ, లక్ష్మి ఆధ్వర్యంలో పోటీలు జరిగాయి. కోటేశ్వరమ్మ, ఉమామహేశ్వ రరావు, బెల్లంకొండ శ్రీనివాసరావు, లక్ష్మీపార్వతి, సత్య రత్న, మురళీధరరావు, సుబ్బారావు, పావన్ కుమార్, రమ్య పాల్గొన్నారు. ఐలవరంలో యోగా, చెస్ పోటీలు జరుగుతాయని తెలిపారు.

ఈ క్రాప్ నమోదు చేసుకోవాలి

ప్రజాశక్తి - రేపల్లె

స్థానిక వ్యవసాయాధికారి కార్యాలయం వద్ద రైతు సేవా కేంద్రం సహాయకులతో సమీక్ష సమావేశం సోమవారం నిర్వహించారు. సమావేశంలో ఎఒ మహేష్‌బాబు మాట్లాడుతూ రైతులు సాగు చేసిన పంటలు ఈ పంట నమోదు వేగవంతం చేయాలని చెప్పారు. ఈ పంట, ఈ కెవైసి కూడా ఈనెల 30లోపు పూర్తి చేయాలని తెలిపారు. ప్రతి ఒక్క రైతు, కౌలు రైతును ఈ పంట నమోదయ్యే లాగా చూడాలని అన్నారు. భవిష్యత్తులో ఈ పంట నమోదులో ఉన్న రైతులకే వ్యవసాయ శాఖ సంబంధించిన సబ్సిడీలు, పథకాలు అందుతాయని తెలిపారు. యూరియా రైతుల నుండి ఎన్ని దఫాలుగా వేశారు, ఇంకెన్ని దఫాలు వేయాలి, ప్రతి ఒక్కరు రైతు సేవ కేంద్రం పరిధిలో ఉన్న రైతుల ఎరువులకు సంబంధించి వివరాలు సేకరించాలని విఎఎలకు సూచించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు గ్రామానికి సంబంధించిన యాక్షన్ ప్లాన్ రెడీ చేసుకోవాలని తెలిపారు. డిబిటీ పెండింగు పేమెంట్ త్వరగా క్లియర్ చేయాలని అన్నారు.



గెలుపొందిన విద్యార్థులతో పాఠశాల యాజమాన్యం

విద్యార్థులకు అభినందనలు

ప్రజాశక్తి - వేటపాలెం

ఒంగోలు ఎజిఎం జూనియర్ కళాశాల ప్రాంగణంలో జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన ధనుర్బాణ టోర్నమెంట్ కం సెలక్షన్స్‌లో స్థానిక హారిజన్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు కె జాన్ వెస్లీ, ఆర్ నవదీప్ అద్భుత ప్రతిభ కనబర్చి జిల్లా ప్రథమ స్థానాలు సాధించినట్లు పాఠశాల సెక్రటరీ పొగడదండ రవికుమార్ తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ఈ విజయంతో హారిజన్ పబ్లిక్ స్కూల్‌లో ఆహ్లాదకర వాతావరణం నెలకొంది. పోటీల నిర్వహణలో జిల్లా ఎస్‌జీఫ్ సెక్రటరీ, ధనుర్బాణ జిల్లా అకాడమీ సెక్రటరీ పిఎల్ రాజు, చుక్క శ్రీను, బి రాంబాబు, ఎంజయలక్ష్మి తదితర జాతీయ స్థాయి జడ్జీలు పాల్గొన్నారు. ఎబిఎన్ కళాశాల ప్రిన్సిపాల్ వి శ్రీవాణి, డాక్టర్ హరిణి విద్యార్థులను అభినందించారు.

రైతులకు యూరియా పంపిణీ

ప్రజాశక్తి - సంతమాగులూరు

మండలంలోని మిన్నేకల్లు, తంగేడుమల్లి గ్రామాల్లోని రైతు సేవ కేంద్రాల ద్వారా రైతులకు యూరియా అందజేసినట్లు ఎఒ షేక్ సైద తెలిపారు. రైతులు సాగు చేసిన పైరును బట్టి, రైతుకు రెండు బస్తాల యూరియా అందజేశామని అన్నారు. మిన్నేకల్లులో 200మంది రైతులకు 420 బస్తాలు, తంగేడుమల్లిలో 200 మంది రైతులకు 420 బస్తాల యూరియ అందజేసినట్లు తెలిపారు.

కారంచేడు : వరి సాగు చేసుకునే రైతులకు యూరియా కొరతలేదని ఎఒ ఎం నాగరాజు సోమవారం తెలిపారు. కారంచేడు పిఎసిఎస్‌లో 530 బస్తాల యూరియా అందుబాటులో ఉంచామని తెలిపారు. కారంచేడులో వరి సాగు చేసే 248మంది రైతులకు ఖాతా నెంబర్ ప్రకారం రెండు బస్తాల చొప్పున పంపిణీ చేసినట్లు తెలిపారు.

మహిళలకు చీరలు పంపిణీ

ప్రజాశక్తి ముండ్లమూరు

యర్రెడ్ల సుబ్బారెడ్డి, సుబ్బమ్మ సేవా సంఘం ఆధ్వర్యంలో స్థానిక ఎస్టీ కాలనీలో 30మంది పేద మహిళలకు ప్లేట్లు, చీరలు సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ ఎర్రెడ్ల అనంతరెడ్డి మాట్లాడుతూ ప్రతి ఏటా మండలంలోని 1000 మంది పేదలకు ప్లేట్లు, దుప్పట్లు, చీరలు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. తమ ట్రస్టు ద్వారా పేదలకు చేయూతనందించి వారి అభివృద్ధికి దోహద పడుతున్నామని అన్నారు.

కేన్సర్ వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి - చెరుకుపల్లి

గ్రామీణ ప్రాంతాల్లో క్యాన్సర్ ద్వారా మహిళలు అధిక సంఖ్యలో మృత్యువాత పడుతున్నారని, వీరిలో అత్యధికులు అవగాహన రాహిత్యంతో చనిపోతున్నారని అంకాలజిస్ట్ డాక్టర్ సమత కడియాల అన్నారు. గుళ్లపల్లి శ్రీ రామచంద్ర నర్సింగ్ హోంలో గర్భాశయ ముఖ ద్వారం, రొమ్ము పరీక్షలకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. అమెరికాకు చెందిన ప్రముఖ వైద్యులచే వైద్య పరీక్షలు నిర్వహించినట్లు డాక్టర్ కొడాలి మోహన్ తెలిపారు. దివంగత డాక్టర్ కొడాలి వరప్రసాద్ జ్ఞాపకార్థం కొడాలి రజినీకాంత్, డాక్టర్ కోడలి విజయలక్ష్మి సౌజన్యంతో అమెరికాకు చెందిన పింక్ సంస్థ, పూర్ణ సుధా క్యాన్సర్ ఫౌండేషన్ సారథ్యంలో గర్భాశయ ముఖ ద్వారానికి సంబంధించిన క్యాన్సర్ పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ సమత మాట్లాడారు. క్యాన్సర్ పరీక్షల కోసం పట్టణాలకు వెళ్లి రూ.వేలల్లో చెల్లించాల్సిన అవసరం లేకుండా శ్రీ రామచంద్ర నర్సింగ్ హోమ్ వైద్యులు ప్రతి ఏటా ఈ శిబిరం నిర్వహిస్తున్నారని తెలిపారు. దేశ, విదేశాల నుండి వచ్చిన క్యాన్సర్ వైద్య నిపుణులు పరీక్షల నిర్వహించి తగు సూచనలు అందిస్తారని అన్నారు. మాజీ శాసన సభ్యులు ముమ్మనేని వెంకట సుబ్బయ్య వైద్య శిభిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ కొడాలి వరప్రసాద్ చిత్రపటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. అమెరికా నుండి వచ్చిన వైద్య బృందం డాక్టర్ జాన్ టాల్ బెట్, కార్ల హౌబాకే, లూయి సౌర్, డాక్టర్ కొడాలి విజయలక్ష్మి, రమ్య పాల్గొన్నారు. మొదటి రోజు 100 మందికి పరీక్షలు నిర్వహించారు. మూడు రోజులపాటు వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.



వైద్య శిబిరంలో అమెరికా వైద్య నిపుణులు



మాట్లాడుతున్న నగరం ఎఒ రమేష్‌బాబు

నానో యూరియాతో అధిక దిగుబడి

ప్రజాశక్తి - నగరం

మండలంలోని సిరిపుడి రైతు సేవా కేంద్రం వద్ద నిర్వహించిన నానో యూరియా అవగాహన సదస్సులో ఎఒ వి రమేష్ బాబు మాట్లాడారు. గుంటూరు వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ (ఆత్మ) తరుపున వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నానో యూరియాపై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. యూరియా కొరతపై రైతులకు అవగా హన కల్పించారు. వరి పంటకు ఏ దశలో ఎంత మోతాదులో ఎరువులు వేయాలనే విషయాలపై రైతులకు తెలిపారు. నానో యూరియా, నానో డిఎపి వాడకం గురించి వివరించారు. ఒక ఎకరాకు అరలీటర్ నానో యూరియా సరిపోతుందని తెలిపారు. రవాణా ఖర్చు ఉండదని, 80శాతం నత్రజని పంటకు అందుతుందని తెలిపారు. దీని పనితనం పంటపై 8 నుండి 10 రోజుల వరకు ఉంటుందని తెలిపారు. మన గ్రోమోర్ మేనేజర్ ఎస్ కిషోర్ పాల్గొన్నారు.

హామీలు అమలు చేయాలి

ప్రజాశక్తి - బాపట్ల

ఎన్నికల ముందు బీసీలకు ఇచ్చిన వాగ్దానాలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే అమలు చేయాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బాపట్ల రవికుమార్ డిమాండ్ చేశారు. కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జెసి గంగాధర్‌కు వినతిపత్రం అందజేశారు. తాతా హరిచంద్ర ప్రసాద్, ఓబిసి జిల్లా అధ్యక్షుడు కొక్కిలగడ్డ శ్రీనివాసరాజు, అగ్నికుల క్షత్రియుల కార్పొరేషన్ డైరెక్టర్ వెంకటేశ్వర రావు, జివిఎల్ మోహన్‌గౌడ్, బీసీ నేతలు ఉల్చి శ్రీను, కంకణాల రాంబాబు, రామ్మోహనరావు, ప్రత్తిపాటి సాయికుమార్ పాల్గొన్నారు.

ఆటల పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి - పర్చూరు

మండలంలోని ఎస్‌ఎఫ్‌ఐ స్కూల్ ఆవరణలో ఆటల పోటీలు ఎస్‌ఎఫ్‌ఐ స్కూల్ ఫాదర్ తంబి జోసెఫ్ సోమవారం ప్రారంభించారు. అండర్ 14, 17 విద్యార్థినీ, విద్యార్థులకు వాలీబాల్, కబడ్డీ పోటీలు నిర్వహించారు. వ్యక్తిగత విభాగంలో అథ్లెటిక్స్‌లో 100, 400 మీటర్లు, షాట్‌పుట్ నిర్వహిం చారు. ప్రతిభ కలిగిన విద్యార్థినీ, విద్యార్థులను జోనల్ స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు తెలిపారు. డివిజన్ స్థాయిలో ప్రతిభ కనపర్చిన విద్యార్థులను జిల్లా, రాష్ట్ర స్థాయికి పంపించనున్నట్లు తెలిపారు. ఎంఈఓలు శివ కోటేశ్వరరావు, ఎంఈఓ వెంకట్రామయ్య పాల్గొన్నారు.



అర్జీలు స్వీకరిస్తున్న ఇన్‌ఛార్జి జేసీ గంగాధర గౌడ్

అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలి


ఇన్‌ఛార్జి సంయుక్త కలెక్టర్ జి.గంగాధర్ గౌడ్

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో నమోదైన అర్జీలను పరిష్కరించిన అనంతరం సంబంధిత వ్యక్తులకు ఖచ్చితంగా ధ్రువీకరణ పత్రం ఇవ్వాలని ఇన్‌ఛార్జి సంయుక్త కలెక్టర్, డిఆర్ఒ జి.గంగాధర్ గౌడ్ తెలిపారు.కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్ కార్యక్రమం గంగాధర్ గౌడ్ అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన అర్జీదారులు వినతి పత్రాల ద్వారా తమ సమస్యలను విన్నవించారు. తమ పరిధిలోని అర్జీలకు ఇన్‌ఛార్జి జేసీ అక్కడికక్కడే పరిష్కార మార్గం చూపారు. కొన్నిటిని పరిశీలన, మరికొన్నిటిని విచారణకు ఆదేశించారు. పీజీఆర్ఎస్ లో మొత్తం 164 అర్జీలు నమోదయ్యాయి. పీజీఆర్ఎస్‌లో నమోదైన ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించాలని సంయుక్త కలెక్టర్ చెప్పారు. ప్రజా సమస్యల పరిష్కారంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తున్నందున అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. ప్రజలను కార్యాలయాల చుట్టూ తిప్పించుకోవడం మంచి పద్ధతి కాదని సూచించారు. అన్నదాత సుఖీభవ పథకం కింద 14,458 అర్జీలు నమోదు అయినట్లు తెలిపారు.వాటిని ఈ నెలాఖరులోపు పరిష్కరించాలని ఆదేశించారు. సీజనల్ వ్యాధులు ప్రబల కుండా ముందస్తు జాగ్రత్తలు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో బాపట్ల ఆర్‌డిఒ పి గ్లోరియా, ఉప కలెక్టర్ లవన్న, సమగ్ర శిక్ష అభియాన్ ఎపిసి నాగిరెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్.విజయమ్మ తదితరులు పాల్గొన్నారు.

డిఎస్‌సి ఉపాధ్యాయుల జాబితా విడుదల

- కౌన్సిలింగ్ ప్రక్రియపై స్పష్టత కరువు
- 672 పోస్టులు ప్రకటన
- 19న విజయవాడలో ఉత్తర్వులు అందజేయనున్న వైనం



ఉపాధ్యాయుల జాబితాను విడుదల చేస్తున్న డిఇఒ

ప్రజాశక్తి - ఒంగోలు సిటీ

మెగా డిఎస్‌సి పోస్టుల కోసం ఎదురు చూస్తున్న వారి కల నేరవేరింది.సిఎస్‌సి ప్రకటించిన డిఎస్‌సికి ఎంపికైన అభ్యర్థుల తుది జాబితాను జిల్లా విద్యా శాఖాధికారి ఎ.కిరణ్ కుమార్ సోమవారం విడుదల చేశారు. జాబితాను డిఇఒ కార్యాలయంలో నోటీసు బోర్డులో ప్రదర్శించారు. జిల్లాలోని ప్రభుత్వ, జడ్‌పి, మండల పరిషత్, మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్ల యాజమాన్యంలోని 629, గిరిజన సంక్షేమ గురుకుల, చెంచు పాఠశాలల్లోని 43 ఖాళీలను భర్తీ చేయనున్నారు.

ప్రభుత్వ, జడ్‌పి, ఎంపిపి యాజమాన్యాల్లోని స్కూల్ అసిస్టెంట్ తెలుగు 36, ఉర్దూ 2, హిందీ 23, ఇంగ్లీషు 94, గణితం 92, ఫిజికల్ సైన్స్ (పిఎస్) 24, బయోలాజికల్ సైన్స్ 70, సోషల్ 106, వ్యాయామ విద్య 72, సెకండరీ గ్రేడ్ టీచర్ తెలుగు 72, ఉర్దూ 8 పోస్టులు ఉన్నాయి. మున్సిపల్ యాజమాన్యం లో 30 పోస్టులను ప్రకటించారు. వీటిలో స్కూల్ అసిస్టెంట్ తెలుగు 1, ఇంగ్లీషు 1, గణితం 2, సెకండరీ గ్రేడ్ పోస్టులు 26 ఉన్నాయి. గిరిజన సంక్షేమ గురుకుల విద్యాలయాలు, చెంచు పాఠశాలలకు 43 పోస్టులు ప్రకటించారు. వీటిలో స్కూల్ అసిస్టెంట్ తెలుగు 2, హిందీ 4, ఇంగ్లీషు 4, గణితం 1, ఫిజికల్ సైన్స్ 2, బయోలాజికల్ సైన్స్ 2, సోషల్ 2, సెకండరీ గ్రేడ్ టీచర్లు గిరిజన పాఠశాలలకు 17, చెంచు పాఠశాలలకు 9 .పోస్టులు ఉన్నాయి.

కౌన్సిలింగ్‌పై స్పష్టత రాని వైనం...

కమిషనర్ సూచనలు ప్రకారం తుది సెలక్షన్ జాబితా వరుసలోనే కౌన్సిలింగ్ ద్వారా పోస్టింగ్స్ ఇవ్వాలి. కౌన్సిలింగ్ వెబ్ ద్వారానా/మాన్యువల్‌గా అనేది ఈ రోజు నిర్ణయిస్తారు. ప్రస్తుతం జిల్లాలో ఉన్న అన్ని ఖాళీలు చూపరని తెలిసింది. టీపీఆర్ (టోటల్ ఫిజికల్ రెస్పాన్స్) ప్రకారం ఫిల్టర్ చేసి అవసరం ఉన్న ప్రదేశాలు చూపి సమానమైన ఖాళీలను మాత్రమే ప్రదర్శిస్తారని, ఆ ప్రకారమే ఖాళీలు భర్తీ చేస్తారని సమాచారం. ఖాళీల అంశం పై జిల్లా విద్యా శాఖకు ఎలాంటి ఆదేశాలు వెలువడలేదు. అభ్యర్థులు కౌన్సిలింగ్‌లో కోరుకున్న జాబితా కౌన్సిలింగ్ అనంతరం ప్రదర్శించనున్నట్లు తెలిసింది. రాష్ట్ర విద్యా శాఖసూచనల ప్రకారం.. ఒక సారి ఒక ప్లేస్ ఆప్షన్ చేసుకొన్న తర్వాత దానిలో ఎలాంటి మార్పులు ఉండవు. పోస్టింగ్ వచ్చిన వారు 15 రోజుల్లో విధుల్లో చేరాలి. ప్రభుత్వ సెలవు దినాలలో విధుల్లో చేరనివ్వరు. ఎంపికయిన అభ్యర్థి పోస్టులో చేరకపోతే ఆ పోస్టును తర్వాత డిఎస్‌సికి చూపుతారు తప్ప వెయిటింగ్ లిస్టు అనేది ఉండదు.

19న నియామక పత్రాల పంపిణీ...

డిఎస్‌సిలో టీచర్లుగా ఎంపికైన వారికి ఈనెల 19న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ నియామక పత్రాలు అందజేస్తారు. ఆ మేరకు జిల్లా నుంచి ఎంపిక అయిన ఉపాధ్యాయులు, వారితో పాటు మరొకరిని పంపేందుకు జిల్లా విద్యా శాఖ ఏర్పాట్లు చేస్తుంది. ఉపాధ్యాయులు 672 తో పాటు సహాయకులు 672 మంది ముందు రోజు ఒంగోలు రప్పించి, ఆ రాత్రి ఇక్కడే బస, ఇతర వసతి ఏర్పాట్లు చేయాలి. 19న ఉదయం వారిని బస్సులు ద్వారా విజయవాడ తరలించే ఏర్పాట్లు విద్యా శాఖ చేపట్టింది. అందుక అవసరమైన వసతి ఏర్పాట్లలో విద్యాశాఖ అధికారులు తల మునకలవుతున్నారు. ఎన్నికల హామీ మేరకు డిఎస్‌సి నియామకాలు చేపట్టిన ప్రభుత్వం డిఎస్‌సి అభ్యర్థుల నియామకం ప్రచార కార్యక్రమంగాఉపయోగించుకోనుంది.

ప్రధాన మంత్రి ఆవాస్ యోజన పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జేసీ గోపాల కృష్ణ

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

ప్రధానమంత్రి ఆవాస్ యోజన - 2 (పిఎంఎయు - అర్బన్) పథకంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రత్యేకంగా రూపొందించిన 'అవగాహన - 2025' పోస్టర్‌ను సంయుక్త కలెక్టర్ ఆర్. గోపాలకష్ణ గ్రీవెన్స్ హాలులో సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పథకంలో అర్హులైన వారు పొందేందుకు అవకాశం ఉన్న ప్రయోజనాల వివరాలను వారికి తెలియజేయడమే లక్ష్యంగా ఈ పోస్టర్లను రూపొందించినట్లు తెలిపారు. ఇప్పటికే లబ్ధి పొందిన వారిని కూడా ఈ ప్రచార కార్యక్రమంలో భాగస్వాములను చేయనున్నట్లు ఆయన వివరించారు. అర్హుల ందరూ ఈ పథకంలో ప్రయోజనాన్ని పొందేలా చూడాలని అధికారులకు సూచించారు. ఇప్పటికే వచ్చిన దరఖాస్తుల పరిశీలన ప్రక్రియను వేగవంతం చేయటం, లబ్ధిదారుల కోసం ప్రత్యేకంగా రుణ మేళాలు నిర్వహించటం, పిఎం సూర్యఘర్ ప్రయోజనాలు కూడా దక్కేలా చూడటం, కొత్తగా నిర్మించిన ఇళ్లలోకి గహప్రవేశాలు జరిగేలా పర్యవేక్షించడం కోసం ఈ పోస్టర్లను రూపొందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఒ బి.చిన ఓబులేసు, హౌసింగ్ పీడీ శ్రీనివాస ప్రసాద్, టిడ్కో డిఇఇ వీరబ్రహ్మాచారి, సిఎల్‌టిసి ఆనంద్, ఎఇఇ మల్లికార్జున రావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

అక్రమ అరెస్టులకు యుటిఎఫ్ ఖండన

ప్రజాశక్తి-సిఎస్.పురం

రాష్ట్రవ్యాప్తంగా యుటిఎఫ్ ఆధ్వర్యంలో శాంతియు తంగా జరుగుతున్న రణభేరి కార్యక్రమంలో పాల్గొన్న నా యకులు, కార్యకర్తలను అక్రమంగా అరెస్టు చేయడాన్ని సిఎస్.పురం మండల యుటిఎఫ్‌శాఖ తీవ్రంగా ఖండిం చింది. అక్రమ అరెస్టులకు వ్యతిరేకంగా సోమవారం యుటిఎఫ్ నాయకులు ధర్నా నిర్వహించారు. విద్యారంగం, ఆర్థిక సమస్యలపై న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పట్టించుకోకుండా, శాంతి యుతం గా నిర్వహిస్తున్న నిరసనలను అడ్డు కోవడం ప్రజాస్వా మ్యానికి విరుద్ధమని మండల నాయకులు పేర్కొన్నారు. ఉపాధ్యాయులు ఎదుర్కొం టున్న సమస్యలు ఈ కార్యక్ర మంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి సాంబశివరావు, యు టిఎఫ్ మండలశాఖ అధ్యక్షులు ఎన్.వెంకట్రామయ్య, మండల ప్రధాన కార్యదర్శి షేక్.పాదుషా, సీనియర్ నా యకులు వెంకట్రావు, తిరుపతయ్య, శ్రీనివాసరాజు, వేమా నారాయణ, కొండయ్య, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నేటి నుంచి ఎస్ఆర్‌పిలకు శిక్షణ

ప్రజాశక్తి -ఒంగోలు సిటీ

మెగా డిఎస్‌సి ద్వారా నియమితులవుతున్న 672 ఎస్‌జిటి, టిజిటి, స్కూల్ అసిస్టెంట్లకు శిక్షణ ఇచ్చేందుకు జిల్లాలో ఆయా సబ్జెక్ట్‌ల్లో నిష్ణాతులైన ఉపాధ్యాయులను స్టేట్ రీసోర్స్‌గా ఎంపిక చేసి మూడు రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి కిరణ్ కుమార్, ఉప విద్యాశాఖాధికారి చంద్రమౌళేశ్వరరావు సోమవారం తెలిపారు. మంగళవారం నుంచి గురువారం వరకూ జిల్లా నుంచి ఎంపిక చేసిన స్కూల్ అసిస్టెంట్స్, డైట్ లెక్చరర్స్‌కు అమరావతి లోని విఐటిలో, ఎస్‌జిటిలకు ఏలూరు జిల్లా ఆగిరిపల్లి హీల్ పారడైజ్‌లో శిక్షణ ఇస్తారన్నారు. జిల్లా నుంచి అనుభవజ్ఞులైన స్కూల్ అసిస్టెంట్స్ జి.నివేదిత (జీవశాస్త్రం),వై యల్ల మందేశ్వరరావు (జీవశాస్త్రం), ఎ. బాలరామకష్ణ (జీవ శాస్త్రం), ఎస్. గౌరి సుజాత (జీవ శాస్త్రం), ఎన్.పార్ధసారధి(తెలుగు), డి. తిరుమల శ్రీనివాస్ (తెలుగు), సిహెచ్.రమేష్ బాబు (హిందీ) డాక్టర్ ఎం.పిచ్చయ్య (హిందీ), షేక్ ఇస్మాయిల్ (ఇంగ్లీషు), ఎస్.యామిని(ఇంగ్లీష్),డి. మధు (ఇంగ్లీష్), కె. సోమిరెడ్డి (ఇంగ్లీష్),ఎం. సురేష్‌బాబు(గణితం), ఎంఎస్. బ్రహ్మానందం (గణితం), వి. చంద్రశేఖర్ (గణితం), ఎం. సరోజిని (గణితం), ఆర్.శ్రీనివాసరావు (భౌతికశాస్త్రం), షేక్ సుభాని (భౌతికశాస్త్రం), ఎస్. నాగిరెడ్డి (సోషల్), బివి. బ్రహ్మాం (సోషల్), కె.గౌతమ్ బాబు(సోషల్) డి. చంద్రశేఖరరావు (సోషల్), వై. సీనయ్య(పిఇటి), బి. కాశివిశ్వనాథరెడ్డి (పిఇటి), పి. రమేష్ (పిఇటి)పి. శివశంకరరావు(పిఇటి), డాక్టర్ జె. సర్దార్ పాపారాయుడు (డైట్ లెక్చరర్), పి. విజయకష్ణ(డైట్ లెక్చరర్)పి. రమేష్ బాబు (డైట్ లెక్చరర్), వీరితో పాటు ఎస్‌జిటిలు వి.రమేష్, బి.వెంకటేశ్వర్లు, డి.పావని, ఎన్. భాస్కరరావు, వై.సంజీవరావు, ఎం.అశోక్ కుమార్, వి.రాజేష్, పి.వీరభద్రుడు రీ సోర్స్ పర్సన్స్ ఎంపికయినట్లు వార తెలిపార. వీరంతా సకాలంలో నిర్దేశించిన శిక్షణ కేంద్రాల్లో రిపోర్ట్ చేయాలని డిఇఒ సూచించారు. శిక్షణ పూర్తయిన తరువాత 22 నుంచి కొత్తగా ఎంపికైన 672 మందికి సమాజంలో ఉపాధ్యాయుని రోల్, క్లాస్ రూమ్ మేనేజమెంట్, విద్యార్థుల పఠనాశక్తి, ఐసిటి, టిఎల్ఎం, డిజిటల్ లెర్నింగ్, కరికులం తదితర అంశాలపై శిక్షణ ఇచ్చి పోస్టింగ్స్ ఇస్తారు.

220 మెట్రిక్ టన్నుల యూరియా పంపిణీ

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

జిల్లా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో 35 రైతు సేవా కేంద్రాలు, పిఎసిఎస్ కేంద్రాల ద్వారా 4,983 మంది రైతులకు 220 మెట్రిక్ టన్నుల యూరియాను సోమవారం పంపిణీ చేసినట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఇంకా 220 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉన్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు.



అర్జీలు స్వీకరిస్తున్న జేసీ గోపాలకృష్ణ

మీకోసం అర్జీలపై ప్రత్యేక దృష్టి : జేసీ

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

మీ కోసంలో వచ్చే ఆర్జీలపై సంబంధిత శాఖల అధికారులు ప్రత్యేక దష్టి సారించి సత్వరమే పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని సంయుక్త కలెక్టర్ ఆర్.గోపాలకష్ణ ఆదేశించారు. స్థానిక గ్రీవెన్స్ హాలులో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పిజిఆర్ఎస్)లో ప్రజల నుంచి జేసీ అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ వచ్చిన అర్జీలను ఆయా శాఖల అధికారులు సత్వరం పరిష్కరించేలా ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఆదేశించారు. మీ కోసం కార్యక్రమానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తున్న నేపథ్యంలో అర్జీదారుల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. ప్రతి ఒక్క అర్జీపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి, వాటికి అర్ధవంతమైన సమాధానం ఇస్తూ పరిష్కారం చూపాలని అధికారులకు సూచించారు. అధికారులు ప్రతి రోజు లాగిన్ అయి ఆన్ లైన్‌లో వచ్చిన వినతులను చూడాలన్నారు. వచ్చిన అర్జీలకు సరైన పరిష్కారం చూపుతూ రీఓపెన్ కేసులు రాకుండా చూడాలని ఆయన దిశా నిర్దేశం చేసారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి బి.చిన ఓబులేసు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు కుమార్, జాన్సన్, శ్రీధర్ రెడ్డి, మాధురి తదితరులు పాల్గొన్నారు.